

ఉష్ణోగ్రత (అంచనా) 27-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	35	27
తెనాలి	35	27
నరసరావుపేట	35	26
బాపట్ల	34	27
రెంటచింతల	36	27
చీరాల	34	27

అధికారులకు కాస్త సమయం ఇవ్వండి

❖ పెండింగ్ అర్జీలపై కలెక్టర్ అధ్యక్షతన త్వరలో సమీక్ష నిర్వహిస్తాం: కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని ❖ సంతృప్తి స్థాయిలో జిల్లాకు 15వ స్థానం: ఇన్‌చార్జి కలెక్టర్

గుంటూరు(తూర్పు), మే 26(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ విభాగంలో వచ్చే ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులకు కాస్త సమయం ఇవ్వాలని బాధితులకు మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సూచించారు. మిగిలిన అంశాల్లో త్వరితగతిన పరిష్కరించేలా అధికారులకు ఆదేశాలిస్తానని చెప్పారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. కార్యక్రమానికి 222 అర్జీలు వచ్చాయి. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లక్ష్మీకుమారి, ఎం.గంగరాజు, డీఆర్వో షేక్ ఖాజవలీ, ఆర్డీవో శ్రీనివాస రావు, సెప్ సీఈవో చంద్రమునితో కలసి ఆయన అర్జీలను స్వీకరించారు. పరిష్కారం కాని సమస్య లపై పూర్తి వివరణ ఇవ్వాలని అధికారులకు సూచనలు చేస్తామని కేంద్ర మంత్రి పెమ్మసాని అర్జీ దారులకు తెలిపారు. అమరావతి పనులు, సంక్షేమ పథకాల నిర్వహణపై అధికారు లు తీరిక లేకుండా ఉన్నారని.. దీనిని కూడా అర్జీదారులు అర్థం చేసు కోవాలన్నారు. పెండింగ్ అర్జీలపై త్వరలోనే కలెక్టర్ అధ్యక్షతన సమీక్ష నిర్వహిస్తామని స్పష్టం చేశారు. తొలుత అర్జీలు రాసే విధానం, ఫి ర్యాదు ఆన్‌లైన్ నమోదు వంటి అంశాలను ఆయన పరిశీలించారు.

సమస్యలు పరిష్కారం కావడం లేదు సారూ..

ఏళ్ల తరబడి తిరుగుతున్నా తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మ సాని చంద్రశేఖర్ వద్ద బాధితులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. చిన్న, చిన్న సమస్యలకు కూడా ఏళ్ల తరబడి తిప్పుతున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏ అధికారిపై ఫిర్యాదు చేస్తున్నామో.. పరిష్కారానికి ఆ అధికారి వద్దకే పంపుతున్నారని.. ఇలా అయితే న్యాయం ఎలా జరుగుతుందని వాపోయారు. జిల్లా ఉన్నతాధికారులు మంచిగానే మాట్లాడుతున్నారని, మండల స్థాయి సిబ్బంది మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ్‌తేజ

సంతృప్తిస్థాయిలో జిల్లాకు 15వ స్థానం

ప్రజాసమ స్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీల పరిష్కారంలో గుంటూరు జిల్లా రాష్ట్రంలో 15వ స్థానంలో ఉందని, సమయపాలన పాటిస్తూ నాణ్యతగా పరిష్కరించాలని, అప్పుడే సంతృప్తి స్థాయి పెరుగుతుందని ఇన్‌చార్జ్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ పేర్కొన్నారు. అర్జీలు స్వీకరించిన ఆయన.. ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఇకపై గోల్డెన్ డే గా నిర్వహించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. పీజీఆర్ఎస్‌లో అందిన అర్జీలను గడువులోపు నాణ్యతగా పరిష్కరించాలన్నారు. పిటీషన్లు ఎస్ఎల్ఏ లోకి వెళ్లకుండా ముందుగానే పరిష్కరించాలన్నారు. జడ్పీ సీఈవో జ్యోతిబసు, డ్వామా, డీఆర్డీఏ, హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్ట ర్లు శంకర్, విజయలక్ష్మి, ప్రసాద్, డీపీఓ నాగ సాయి కుమార్, పంచా యతీ రాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య, డీటీసీకే సీతారామిరెడ్డి పాల్గొన్నారు.

● కారుణ్య నియామక పత్రాలు అందజేత

కారుణ్య నియామకాల్లో భాగంగా కొటికల సాల్మన్ రాజు, రుంజల రవిసాగర్, పద్మ సాయి నిఖిలను వ్యవ సాయ శాఖలో జూనియర్ అసిస్టెంట్లుగా నియమిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ అందజేశారు. కేటాయించిన శాఖలో రిపోర్ట్ చేయాలని వారికి సూచించారు.



కలెక్టరేట్‌కు వచ్చిన విభిన్న ప్రతిభావంతులతో మాట్లాడుతున్న పెమ్మసాని చంద్రశేఖర్

- స్థానిక గుజ్జనగుండ్లకు చెందిన కృష్ణకుమారి తన కూతురు రాధికకు తొలగించిన దివ్యాంగ పింఛను పునరుద్ధరించాలని కోరారు. 90 శాతం దివ్యాంగురాలని, సదరన్ సర్టిఫికెట్ ఉందన్నారు. ఇంటికి రెండు మీటర్లు ఉన్న కారణంతో గతంలో వచ్చే పింఛను తొలగించారని తెలిపారు.
- స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లోని వసతి గృహాన్ని తనిఖీ చేయాలని విభిన్న ప్రతిభావంతుల ఆదరణ సేవా సంస్థకు చెందిన విభిన్న ప్రతిభావంతులు మంత్రి పెమ్మసానికి వినతి పత్రం అందజేశారు. తమకు అన్ని కార్యాలయాల్లో స్పెషల్ గ్రీవెన్స్ ఏర్పాటు చేయాలని కోరారు. విభిన్న ప్రతిభావంతుల కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాన్ని శారీరక వైకల్యం లేని వారికి కేటాయించారని దీనిపై విచారణ జరిపించాలని కోరారు.
- తన తండ్రి నుంచి కొనుగోలు చేసిన భూమిని ఆన్‌లైన్ చేసేందుకు.. 15 ఏళ్ల నుంచి అధికారుల చుట్టూ తిరుగుతున్నానని తుళ్లూరు మండలం పెదపరిమికి చెందిన పప్పుల సామ్రాజ్యం పెమ్మసానికి తెలిపారు. 15 సెంట్లు తగ్గినట్లు అధికారులు చెబుతున్నారని చెప్పారు. దీనిపై పెమ్మసాని స్పందించి తహసీల్దారుతో ఫోన్‌లో మాట్లాడారు. వారం రోజుల్లోపు సమస్యను పరిష్కరించాలని స్పష్టం చేశారు.



స్టాండింగ్ కమిటీ సమావేశంలో ప్రసంగిస్తున్న మేయర్ కోవెలమూడి రవీంద్ర, పక్కన కమిషనర్ పులి శ్రీనివాసులు, సభ్యులు

రూ.41 కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం

● గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర

గుంటూరు కార్పొరేషన్, మే 26(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో సుమారు రూ.41 కోట్లతో పలు డివిజన్లలో అభివృద్ధి పనులకు స్థాయి సంఘం ఆమోదం తెలిపిందని అధ్యక్షుడు, నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. సోమవారం తన చాంబర్‌లో నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి నగర పాలక సంస్థ స్థాయి సంఘ సమావేశాన్ని మేయర్ నిర్వహించారు. పలు అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. సమావేశంలో నగరంలోని ఆయా డివిజన్ల ప్రజా ప్రతినిధులు, నగర పాలక సంస్థ అధికారులు ప్రతిపాదించిన 117 అంశాలకు సంబంధించిన అభివృద్ధి పనులను స్థాయి సంఘ సభ్యులు, నగర పాలక సంస్థ వివిధ విభాగాధిపతులతో విపులంగా చర్చించారు. ఈ సందర్భంగా మేయర్ కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ... వార్డుల వారీగా జరిగే అభివృద్ధి పనులు, ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ ప్రకారం స్థానిక కార్పొరేటర్లకు ముందస్తు సమాచారం అందించి ఆహ్వానించాలని చెప్పారు. గుంటూరు నగరంలో కుల, మత పార్టీలకతీతంగా ప్రధానంగా మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా నగరంలోని శివారు ప్రాంతాల్లో అభివృద్ధి పనుల నిర్వహణకు శంకుస్థాపనలు చేస్తున్నామని, అంతేకాక ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారుల పరిశీలనలో గుర్తించిన ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా డివిజన్ల వారీగా ప్రాధాన్య క్రమంలో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టుల నిర్మాణాలకు ఆమోదం తెలిపామని మేయర్ వెల్లడించారు. విలీన గ్రామాల్లో కూడా సీసీ డ్రెయిన్లు, రోడ్ల ఏర్పాటుకు ప్రత్యేక ఆమోదం తెలిపినట్లు చెప్పారు. స్థాయి సంఘ సభ్యులు ఈరంటి వరప్రసాద్, షేక్ మీరావలి, కొమ్మినేని కోటేశ్వర రావు, నూకవరపు బాలాజీ, దాసరి లక్ష్మీదుర్గ, ముప్పవరపు భారతి, నగర పాలక సంస్థ వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

కూటమిలోకి.. కోవర్టులు



- మాచర్ల ఉదంతంతో బట్టబయలు
- పలు నియోజకవర్గాల్లో అదే పరిస్థితి
- నాడు వైసీపీలో ఉండి అరాచకాలు
- రక్షణ కోసం నేడు కూటమి పార్టీల్లోకి చొరబాటు

పల్నాడు ఎస్పీ తీరుపై టీడీపీ ఎమ్మెల్యేల ఆగ్రహం

తలలు పట్టు కుంటున్న టీడీపీ శ్రేణులు

గుంటూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీ అధికారంలోకి వచ్చిందన్న ఆనందం చాలా వరకూ పార్టీ శ్రేణుల్లో కనిపించడం లేదు. కూటమి పార్టీలలో వైసీపీ కోవర్టుల సంఖ్య ఎక్కువ ఉండడమే అందుకు కారణంగా తెలుస్తోంది. ఈ కోవర్టుల వ్యవహారం పార్టీకి అంకితమై పనిచేసిన కార్యకర్తలను అభద్రతా భావానికి గురిచేస్తోంది. అధికారంలో ఉన్న టీడీపీని బలహీన పరిచేందుకు వైసీపీ ఆడుతున్న కొత్త నాటకం ప్రస్ఫుటంగా కనిపిస్తున్నప్పటికీ ఏమి చేయలేని దుస్థితి ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మెజారిటీ నియోజకవర్గాల్లో కనిపిస్తుంది. మాచర్ల నియోజకవర్గంలో తాజాగా జరిగిన హత్యలు.. ఆ తరువాత వెలుగులోకి వచ్చిన ఇద్దరూ ఒక పార్టీ వాళ్లే అన్న ప్రచారం కలవరాన్ని పుట్టిస్తున్నది. వాస్తవానికి హత్యకు గురయినవారు ఎప్పటి నుంచో తెలుగుదేశం పార్టీలో ఉన్నారు. హత్యకు పాల్పడిన వారు పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి అనుచరులుగా ముద్ర పడిన వాళ్లే. వ్యూహాత్మకంగా వాళ్లను టీడీపీలోకి పంపి హత్యలకు ఒడిగట్టినట్లు తెలుస్తోంది. టీడీపీ బలంగా ఉన్న ప్రతి గ్రామంలోనూ ఇదే రీతిలో వైసీపీ సానుభూతి పరులను పార్టీ మారినట్లు నాటకం ఆడించి, బలహీన పర్చే కుట్రలకు తెరలేచినట్లు తెలుస్తోంది. ఒక వేళ నేరుగా టీడీపీలో చేరే అవకాశం లేకపోతే కూటమి ప్రభుత్వంలో భాగస్వాములైన జనసేన, బీజేపీల్లోకి వైసీపీ కీలక నేతలు చేరి పోతున్నారు. ఇటువంటి చేరికలవల్ల టీడీపీకి సంస్థాగతంగా కోలుకోలేని దెబ్బ తగులుతోంది. ఫ్యాక్షన్ నేపథ్యం ఉన్న పల్నాడులో కొత్త చేరికలు వల్ల టీడీపీకి పెను ప్రమాదం జరుగుతున్నట్లు తెలుస్తోంది.

అప్పుడూ వాళ్లే.. ఇప్పుడూ వాళ్లే..

గత వైసీపీ ప్రభుత్వంలో ఉమ్మడి గుంటూరులో కొందరు నేతలు భయంకరమైన అవినీతి, అక్రమాలకు పాల్పడి నవారే. అదేమని ప్రశ్నించిన టీడీపీ నేతలను చాలా ఇబ్బందులకు గురిచేశారు. ఇప్పుడు అదే నేతలు కూటమి ప్రభుత్వంలోని పార్టీలలో చేరటం టీడీపీ శ్రేణులను కలవరపరుస్తోంది. అప్పట్లో భయంకరంగా దాడులు చేసి అక్రమంగా కేసులు బనాయించిన వారు ఇప్పుడు ఏమి తెలియనట్లుగా సేఫ్ జోన్‌లో ఉండటం ఇబ్బందులు పడిన కార్యకర్తలను మానసిక వ్యథకు గురిచేస్తోంది. ఉదాహరణకు పొన్నూరు మాజీ ఎమ్మెల్యే కిలారు రోశయ్య గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేయని దుర్మార్గం లేదు. ప్రభుత్వాధికారాన్ని అడ్డం పెట్టుకొని మట్టిని ఇష్టానుసారంగా తవ్వి కోట్లాది రూపాయలు సంపాదించినట్లు ఆరోపణలు ఉన్నాయి. కాగా ఎన్నికల సమయంలో అన్ని ఆరోపణలు ఉన్న ఆయనకు అసలు టిక్కెట్ ఇవ్వరని చాలామంది భావించారు. వైసీపీ అధినాయకత్వం అవేవీ పట్టించుకోకుండా ఎంపీ సీటును కట్టబెట్టింది. ఎన్నికల్లో రోశయ్య ఘోరంగా ఓడిపోయారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన మీద విచారణ జరుగుతుందని అందరూ అనుకున్నారు. ఆలోపే కిలారు రోశయ్య కూటమి ప్రభుత్వంలోని భాగస్వామి అయిన జనసేనలో చేరారు. ఇప్పుడు అన్ని కేసులలో తప్పించుకొని దర్జాగా తిరుగుతున్నారు. తాజాగా జరిగిన మినీ మహానాడులో కూడా పొన్నూరు ఎమ్మెల్యే నరేంద్ర అదే అంశంపై ఆందోళన వ్యక్తంచేశారు. వాస్తవా నికి కూటమి పార్టీలలో ఎవరినైనా చేర్చు కొనే విషయంలో మిగిలిన పార్టీల అభిప్రాయంతో పనిలేకుండానే జరుగుతుండటం ఇబ్బందికరంగా మారింది.

పల్నాడు ఎస్పీ తీరుపై విమర్శలు

పల్నాడు జిల్లాలోని ఎస్పీ తీరు చూస్తుంటే అధికారంలో ఏ పార్టీ ఉందో అర్థం కాకుండా ఉంది. ఎస్పీ పూర్తిగా వైసీపీకి కొమ్ము కాస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. వైసీపీ వాళ్లకు ఏదైనా జరిగిందంటే తీవ్రంగా స్పందిస్తున్న ఎస్పీ, టీడీపీ వాళ్ళ విషయంలో మాత్రం పట్టీ పట్టనట్టు ఉంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పైగా జంట హత్యలు జరిగిన వెంటనే టీడీపీలో అంతర్గత విభేదాలవల్లే హత్యలు అని పలనాడు ఎస్పీ ప్రకటించడం కూడా వివాదాస్పదమైంది. ఆ తరువాత జరిపిన దర్యాప్తులో పిన్నెల్లి సోదరుల పాత్ర కూడా ఉందని నిర్ధారణ కావటం వారిపై కూడా కేసు నమోదు అయింది. దీంతో ఎస్పీ తొలుత చేసిన ప్రకటన వైసీపీ నేతలకు అస్త్రంగా మారింది. ఈ నేపథ్యంలో ఎస్పీ పై పలువురు సీనియర్ ఎమ్మెల్యేలు అధిష్టానానికి ఫిర్యాదు చేశారు.



వారం రోజులు వానలే వానలు

గుంటూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): రోహిణీ కార్తెలో సెగలు గక్కాల్సిన ప్రచండ భానుడిని కారు మబ్బులు కమ్మేశాయి. ఉదయం భగభగలాడినా కాసేపటికే ఆకాశం మేఘావృతమవుతోంది. ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల కంటే దిగువనే నమోదవుతున్నాయి. దీంతో మారిన వాతావరణాన్ని జిల్లా ప్రజానీకం ఆస్వాదిస్తోంది. ఈ ఏడాది నైరుతి రుతు పవనాలు ముందుగానే వచ్చేస్తున్నాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో ఇక ఎండల నుంచి ఉపశమనం లభించినట్లేనని చాలామంది భావిస్తున్నారు. రాబోయే వారం రోజుల పాటు.. జూన్ 2వ తేదీ వరకు నిత్యం వర్షం పడుతుందని వాతావరణ శాఖ తెలిపింది. కొన్ని ప్రాంతాల్లో 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయ డంతో పాటు కుండపోత వర్షానికి ఆస్కారం ఉందని ప్రక టించింది. మే నెల మధ్యలో కేవలం ఐదు, ఆరు రోజులు మాత్రమే ఎండలు కాశాయి. ఆ తర్వాత నిత్యం వర్షం కురవడం, మేఘావృతం కావడం జరుగుతోంది. సోమవారం ఉదయం 7 గంటలకే ఎండ విరగకాయగా.. ఉదయం 11 గంటలకల్లా చల్లబడిపోయింది. సాయంత్రం వరకూ వాతావరణం అలానే కొనసాగింది. మంగళవారం పల్నాడు జిల్లాలో పిడుగులతో కూడిన వర్షం కురుస్తుంద ని, 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తా యని వాతావరణ శాఖ పేర్కొంది. 28, 29 తేదీల్లో కూడా భారీ వర్షం కురుస్తుందని హెచ్చరించింది. గుంటూరు, బాపట్ల జిల్లాల్లోనూ ఇలాంటి వాతావరణమే ఏర్పడు తుందని బులెటిన్ విడుదల చేసింది. ఇక ఈ నెల 30 నుంచి జూన్ 2వ తేదీ వరకు కూడా ఉరుములు మెరుపులు, పిడుగులతో కూడిన వర్షం కురుస్తుందని వాతావరణ శాఖ ప్రకటించింది. జూన్ 1, 2 తేదీల్లో అడపాదడ పాగా వర్షాలు కురుస్తాయంది. వర్షాలు విస్తారంగా కురుస్తున్నా ముందస్తు ఖరీఫ్ సాగుకు సంబంధించి ఎలాంటి ప్రణాళికలను వ్యవసాయ శాఖ విడుదల చేయలేదు. పత్తి పంట సాగు జూన్ 15 తర్వాతే రైతులు చేపడతారని అధికారులు తెలిపారు. వరి పంట సాగు డెల్టా కాల్వ లకు నీటి విడుదల చేసే తేదీపైనే ఆధారపడి ఉంటుందని చెప్పారు.

కడపకు క్యూ..!

- మహానాడుకు బారులు తీరిన తమ్ముళ్లు
- నేతల సారథ్యంలో భారీగా తరలింపు
- బస్సులు, కార్లు, ప్రత్యేక వసతుల ఏర్పాటు
- స్వచ్ఛందంగా పలువురు అభిమానులు, కార్యకర్తలు

గుంటూరు,మే 26(ఆంధ్రజ్యోతి): తెలుగు తమ్ముళ్లు కడపకు క్యూ కట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చాక తెలుగుదేశం పార్టీ జరుపుకుంటున్న తొలి మహానాడు కావడంతో తమ్ముళ్లు రెట్టించిన ఉత్సాహంతో మహానాడుకు పయనమయ్యారు. దీనికి తోడు ఈసారి మహానాడు తొలిసారిగా కడపలో జరుగుతున్న నేపథ్యంలో నాయకులే కాకుండా, సాధారణ కార్యకర్తల్లోనూ ఎంతో ఆసక్తి నెలకొంది. చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో మహానాడు విజయవంతం చేసుకోవాలని ఉవ్విళ్లూరుతున్నారు.

● తలమునకలైన నేతలు

కడప మహానాడును జిల్లాలోని ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. పార్టీ శ్రేణులను తరలించేందుకు విస్తృత ఏర్పాట్లు చేశారు. అసెంబ్లీ, జిల్లా స్థాయిలో జరిగిన మహానాడులు దిగ్విజయంగా పూర్తి కావడంతో అదే ఉత్సాహం కొనసాగిస్తున్నారు. జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలు కార్యకర్తలను తరలించేందుకు ప్రత్యేకంగా బస్సులు, కార్లు ఏర్పాటు చేశారు. పలువురు కార్పొరేషన్ చైర్మన్లు కూడా శ్రేణులను తరలించే పనిలో మునిగిపోయారు. ఒక్కో నియోజకవర్గం నుంచి రెండు బస్సులు, 50కి పైగా కార్లు సిద్ధం చేసినట్లు నేతలు చెబుతున్నారు. గుంటూరు నగరంలో డివిజన్, క్లస్టర్ ఇన్‌చార్జిలు, గ్రామ నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు భారీగా తరలి వెళ్లేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. చాలా మంది కార్యకర్తలు స్వంతంగా మహానాడుకు వెళ్లడానికి సిద్ధమయ్యారు. టీడీపీ కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో రైళ్లలో రిజర్వేషన్లు చేయించుకుని.. కడపకు ప్రయాణమైనట్లు తెలుస్తోంది.



తుళ్లూరులో మహానాడు సమాయత్త ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ శ్రేణులు

రికవరీ మేనేజర్ ఆత్మహత్య


జక్కా శ్రీరామ్‌కుమార్ మృతదేహం

● రూ.40 లక్షలు కంపెనీ సొమ్ము వాడుకున్నాడని ఆరోపణ

నాదెండ్ల, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరం గ్రామానికి చెందిన ఫైనాన్స్ కంపెనీ రికవరీ మేనేజర్ జక్కా శ్రీరామ్ కుమార్(32) సోమవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన గడిచిన రెండేళ్లుగా చిలకలూరిపేట పట్టణంలోని శ్రీరామ్ ఫైనాన్స్ కంపెనీలో రికవరీ మేనేజరుగా పని చేస్తున్నాడు. అతను సుమారు రూ.40 లక్షలు కంపెనీ సొమ్ము వాడుకున్నాడన్నది యాజమాన్యం ఆరోపణ. కొంత కాలంగా సొమ్మును చెల్లించాలని యాజమాన్యం అతనిపై ఒత్తిడి చేస్తోంది. ఈ క్రమంలో గ్రామంలోని జక్కావారి వీధిలో నివాసం ఉంటున్న మేనేజర్ ఎవ్వరూ లేని సమయంలో తన ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య సింధూర, కుమార్తె రిషిక, కుమారుడు అభయ బాలాజీ ఉన్నారు. భార్య సింధూర గణపవరం గ్రామ పంచాయతీలో బిల్లు కలెక్టర్‌గా పని చేస్తున్నారు. తన భర్త శ్రీరామ్ ఫైనాన్స్ కంపెనీ ఒత్తిడి, బెదిరింపుతోనే ఆత్మహత్య చేసుకున్నాడని, ఎలాంటి సొమ్ము వాడు కోలేదని నాదెండ్ల పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ పుల్లారావు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు.



నడక యాతన

గుంటూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు అత్యవసర పరిస్థితిలో వచ్చే వారు నడ(ర)క యాతన పడుతున్నారు. అత్యవసర పరిస్థితిలో ఆసుపత్రికి వచ్చిన వారిని లోపలికి తీసుకువెళ్లేందుకు తగినంత మంది సహాయకులు ఇక్కడ లేరు. ఉన్న స్ట్రక్చర్లు.. వీల్ చైర్స్ అందుబాటులో లేవు. ఫలితంగా రోగిని వెంట వచ్చిన సహాయకులు.. చేతులతో ఎత్తుకొని కష్టం మీద మోసుకొని పోవాల్సిన దుస్థితి నెలకొంది. - (ఆంధ్రజ్యోతి, గుంటూరు)

మహానాడుకు డేగల రూ.10లక్షల విరాళం


డేగల ప్రభాకర్

గుంటూరు, మే 26(ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న తెలుగుదేశం పార్టీ పసుపు పండుగ మహానాడుకు ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ డేగల ప్రభాకర్ రూ.10 లక్షల విరాళమిచ్చారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన పార్టీ పెద్దలకు నగదు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా డేగల ప్రభాకర్ మాట్లాడుతూ కడప గడ్డపై మొదటి సారిగా జరుగుతున్న టీడీపీ మహానాడును చరిత్రలో నిలిచిపోయేలావిజయ వంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి కడప వచ్చే ప్రజలకు వసతి, భోజన ఏర్పాటులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు జరిగినట్లు డేగల తెలిపారు.

దైవ దర్శనానికి వెళ్తూ.. మృత్యు ఒడిలోకి..

● ఆటో బోల్తా.. మహిళ మృతి


జీవరత్నం మృతదేహం

మాచర్లటౌన్, మే 26(ఆంధ్రజ్యోతి): దైవ దర్శనానికి వెళ్తూ ప్రమాదవశాత్తూ మహిళ మృతిచెందిన ఘటన ఆదివారం రాత్రి మాచర్ల పట్టణంలో జరిగింది. పల్నాడు జిల్లా పెదకూరపాడుకు చెందిన చెంబేటి జీవరత్నం(33) తన బంధువులతో కలిసి విజయపురిసౌత్‌లోని సాగరమాత ఆలయంలో నిద్ర చేసేందుకు రైలులో రాత్రి మాచర్లకు చేరుకున్నారు. రైల్వేస్టేషన్ వద్ద సుమారు పది మంది తోటి ప్రయాణికులతో కలిసి ఆటో ఎక్కింది. రాత్రి 11 గంటలకు విజయపురిసౌత్ వెళ్తుండగా పట్టణ శివారులోని ఆర్టీసీ గ్యారేజీ వద్ద వీధి కుక్కలు హఠాత్తుగా అడ్డురావడంతో వాటిని తప్పించబోయి డ్రైవర్ ఆటో సడన్ బ్రేకు వేశాడు. ఈ క్రమంలో ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో జీవరత్నం తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మిగిలిన 9 మందికి స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. జీవరత్నం మృతదేహన్ని పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహన్ని బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

షూటర్ ముఖేష్‌కు కాంస్య పతకం


కాంస్య పతకం సాధించిన ముఖేష్ నేలవల్లి

తాడేపల్లి (వడ్డేశ్వరం), మే 26 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో బీటెక్ సీఎస్ఐటీ 3వ సంవత్సరం చదువుతున్న విద్యార్థి ముఖేష్ నేలవల్లి. ఐఎస్ఎస్ఎఫ్ రైఫిల్ షూటింగ్ ప్రపంచ జూనియర్స్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించినట్లు వర్సిటీ క్రీడల డైరెక్టర్ డాక్టర్ కె.హరికిషోర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 25 మీటర్ల రాపిడ్ ఫైర్ పిస్టల్ విభాగంలో 22 పాయింట్లతో ముఖేష్ పతకం సాధించినట్లు వెల్లడించారు. ఈ నెల 24 నుండి జర్మనీలోని సుహీ షూటింగ్ రేంజ్‌లో ఈ పోటీలు జరిగాయి. ఫ్రాన్స్‌కు చెందిన థామస్ క్లైమెంట్ స్వర్ణం, పోలెండ్‌కు చెందిన విక్టర్ లూకాస్ రజత సాధించారని పేర్కొన్నారు. ముఖేష్‌ను కేఎల్‌యూ యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.

ఉద్యోగాల పేరిట ఘరానా మోసం!

● విదేశాలకు పంపిస్తామని రూ.5 కోట్లు వసూలు
● గ్రీవెన్స్‌లో ఎస్పీకి ఫిర్యాదు చేసిన విద్యార్థులు

పిడుగురాళ్ల, మే 26 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని పిడుగురాళ్ల పట్టణంలోని లలిత ఇన్‌స్టిట్యూట్ యాజమాన్యం మోసం చేసిందని పలువురు విద్యార్థులు సోమవారం నరసరావుపేటలో జరిగిన గ్రీవెన్స్‌లో జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. లలిత టూరిజం అండ్ హోటల్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ పేరుతో భారీగా ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురి నుండి భారీగా నగదు వసూలు చేశారని విద్యార్థులు హనుమంత మూర్తి, యశ్వంత్, జక్కం శాంతి ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. 2022-24 మధ్య కాలంలో యూరప్‌కు పంపిస్తామని ఒక్కో విద్యార్థి నుండి రూ.30లక్షల నుండి రూ.40 లక్షల వరకు నగదు వసూలు చేశారని పేర్కొన్నారు. ఉద్యోగం వచ్చిందంటూ కొందరిని మోసం చేసి ఊటీ ట్రిప్‌కు సంస్థ యాజమాన్యం పంపిస్తున్నట్లు ఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు. సంస్థ యజమాని పసుమర్తి కిషోర్, అతని బంధువులు, మేనేజర్ కత్తి సునీత తమవద్ద సుమారు రూ.5 కోట్లకు పైగా వసూలు చేశారని ఎస్పీకి వివరించారు. డబ్బు చెల్లించాలని అడిగితే తమపైనే ఎస్సీ ఎట్రాసిటీ కేసు పెడతామని బెదిరిస్తున్నారని తెలిపారు.

వెబ్‌సైట్‌లో హెచ్‌ఎంల సీనియార్టీ జాబితా

● నేడు సర్టిఫికెట్ల పరిశీలనకు రావాలి:డీఈఓ

గుంటూరు (విద్య) మే 26 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని జిల్లా పరిషత్, మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సీనియార్టీ జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈఓ సివి రేణుక సోమవారం ప్రకటనలో తెలిపారు. జాబితాలోని ఉపాధ్యాయులు మంగళవారం గుంటూరులోని పాత బస్టాండ్ వద్ద ఉన్న ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగే సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకావాలని పేర్కొన్నారు. విద్యార్హతల ధ్రువీకరణ పత్రాలు రెండు సెట్లు, సేవా పుస్తకం తీసుకురావాలని తెలిపారు. ఇతర వివరాల కోసం www.deogngblogspot.in వెబ్‌సైట్‌లో చూసుకోవాలని పేర్కొన్నారు.

పీఎస్ హెచ్‌ఎంల సీనియార్టీ జాబితా...

ఉమ్మడి జిల్లాలో పీఎస్ హెచ్‌ఎం బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న వారి జాబితాను(www.deogngblogspot.in) వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈవో సీవీ రేణుక తెలిపారు. అభ్యంతరాలు ఉంటే మంగళవారం సాయంత్రంలోగా తెలియజేయాలని పేర్కొన్నారు.

నేడు స్కూల్ అసిస్టెంట్స్ సర్టిఫికెట్ల పరిశీలన

గుంటూరు(విద్య),మే 26(ఆంధ్రజ్యోతి): గుంటూరు జోన్ 3 పరిధిలోని పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్స్, తత్సామాన క్యాడర్‌లో పనిచేస్తున్న వారికి గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల ఉద్యోగోన్నతులు కల్పించేందుకు మంగళవారం సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహిస్తున్నట్లు ఆర్జేడీ లింగేశ్వర రెడ్డి సోమవారం తెలిపారు. గుంటూరులోని ఆర్జేడీ కార్యాలయంలో జరిగే సర్టిఫికెట్ల పరిశీలనకు జోన్ 3 పాఠశాలల స్కూల్ అసిస్టెంట్ క్యాడర్ ఉపాధ్యాయులు హాజరుకావాలని తెలిపారు. ఇందులో సీరియల్ నంబరు 1 నుంచి 75 వరకు పేర్లు ఉన్నవారు తప్పనిసరిగా హాజరుకావాలని పేర్కొన్నారు.

ముందస్తు భద్రత డ్రైవ్‌లు నిర్వహించాలి

● దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్



దక్షిణ మధ్య రైల్వే జీఎం వీడియో కాన్ఫరెన్స్‌కి హాజరైన డీఆర్‌ఎం సుధేష్ణ సేన్

గుంటూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): రాబోయే వర్షాకాలం దృష్ట్యా రైల్వేట్రాక్‌ల వెంట ముందస్తు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ ఆదేశించారు. సోమవారం ఆయన సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గుంటూరు డీఆర్‌ఎం సుధేష్ణ సేన్‌తో సమీక్షించారు. తొలుత డివిజన్ వ్యాప్తంగా వర్షాకాలం సంసిద్ధత గురించి అడిగి తెలుసుకొన్నారు. అనంతరం జీఎం మాట్లాడుతూ అనివార్య పరిస్థితులను నివారించడానికి ట్రాక్‌లు, వంతెనలు, భారీ వర్షపాతం ఉన్న ప్రదేశాలు, అన్ని కీలక విభాగాల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు. సిగ్నలింగ్ వ్యవస్థ మొదలైన వాటి సరైన పనితీరును నిర్ధారించాలని ఆయన డీఆర్‌ఎంకు సూచించారు. రైలు కార్యకలాపాలలో కఠినమైన సమన్వయం, రైళ్లను నడుపుతున్నప్పుడు అనుసరించాల్సిన అన్ని భద్రత చర్యలను నొక్కి చెప్పారు. సంఘ విద్రోహ శక్తుల కార్యకలాపాల నుంచి ట్రాక్ భద్రతను పెంపొందించేందుకు అదనపు ఆర్‌పీఎఫ్ బలగాలను, పెట్రోలింగ్ సిబ్బందిని నియమించాలన్నారు. త ద్వారా ట్రాక్ పెట్రోలింగ్ బలోపేతం చేయాలని అధికారులకు సూచించారు.

చిత్తడి నేల అథారిటీకి నలుగురు

అధికారేతర సభ్యుల నియామకం

అమరావతి, మే26(ఆంధ్రజ్యోతి): స్టేట్ వెట్‌ల్యాండ్(చిత్తడి నేలల) అథారిటీకి నలుగురు అధికారేతర సభ్యులను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులిచ్చింది. స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్‌కు చెందిన చిత్తడి నేలల జీవావరణ శాస్త్ర నిపుణుడు ఆర్ రామ సుబ్రహ్మణియన్, ప్రపంచ వ్యాప్త ప్రకృతి నిధి(డబ్ల్యూడబ్ల్యూఎఫ్-ఇండియా) రాష్ట్ర సంచాలకుడు ఫరీదా తంపాల్, కోయంబత్తూర్‌లోని తడిభూముల జీవావరణ విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ గోల్డిన్ క్వాడ్రోస్, డెహ్రాడూన్‌లోని అంతరించిపోతున్న జాతుల నిర్వహణ సంస్థ శాస్త్రవేత్త ఆర్ సురేష్‌కుమార్ సభ్యులుగా నియమితులయ్యారు. కాగా రాష్ట్రంలో చిత్తడి నేలల పరిరక్షణ కోసం స్టీరింగ్ కమిటీ స్థానంలో ఈ అథారిటీ ముఖ్యమంత్రి అధ్యక్షతన ఏర్పాటైంది. అధికారులతో పాటు మూడేళ్ల పదవీ కాలానికి అధికారేతర సభ్యులను ప్రభుత్వం నామినేట్ చేసింది.

కారును ఢీకొన్న లారీ..

● నలుగురికి స్వల్పగాయాలు ● కలికివాయి ఫ్లైవోవర్‌పై ప్రమాదం

సింగరాయకొండ, మే 26 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై ముందువెళ్తున్న కారును వెనుకవైపు వస్తున్న లారీ ఢీకొనడంతో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం కలికివాయి ఫ్లైవోవర్‌పై సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. చిలకలూరిపేటకు చెందిన నిమ్మల చంద్రశేఖరరావు-రాజేశ్వరి, కాకుమాని అంజన్‌రావు-చిలకమ్మ దంపతులు తిరుమలకు వెళ్లి దైవదర్శనం చేసుకున్నారు. తిరిగి స్వగ్రామానికి బయల్దేరారు. కారు కలికివాయి ఫ్లైవోవర్ వద్దకు చేరుకునే సరికి వెనుక వైపు వస్తున్న లారీ అదుపుతప్పి ఢీకొట్టింది. దీంతో రోడ్డుపై కారు బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న హైవే మొబైల్ పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కారులో ఉన్న వారిని బయటకు తీశారు. అనంతరం అక్కడికి చేరుకున్న ఎస్సై బి.మహేంద్ర హైవే అంబులెన్స్‌లో ప్రథమ చికిత్స చేయించి క్షతగాత్రులను ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అనంతరం క్రేన్ సహాయంతో కారును పక్కను తొలగించారు. లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఘటనపై కేసు నమోదుచేసినట్లు ఎస్సై తెలిపారు.


రోడ్డుపై బోల్తా కొట్టిన కారు

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.10 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

ఇసుక సరఫరాకు ఇబ్బందులు తలెత్తరాదు

● ఇన్‌ఛార్జ్ కలెక్టర్ భార్గవ తేజ



జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో పాల్గొన్న ఇన్‌ఛార్జ్ కలెక్టర్ భార్గవ తేజ

గుంటూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వర్షాకాలంలో ఇసుక సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ముందస్తు చర్యలు చేపట్టాలని ఇన్‌ఛార్జ్ కలెక్టర్ ఏ భార్గవ తేజ ఆదేశించారు. ఇసుక స్టాక్ పాయింట్లలో అవసరం మేరకు నిల్వలను పెట్టుకోవాలని సూచించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని డీఆర్‌సీ మీటింగ్ హాల్‌లో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం నుంచి వైకుంఠపురం వరకు కృష్ణానదిలో ఉన్న నావిగేషన్ ఛానల్-4లో ఇసుక తవ్వకాలకు సంబంధించి సర్వే సత్వరమే పూర్తి చేయాలన్నారు. ఆ వెంటనే పెనుమాక, రాయపూడి, వెంకటపాలెం, లింగాయపాలెం, బోరుపాలెం, అబ్బురాజుపాలెంలో ఇసుక పూడిక తొలగింపునకు బోట్స్‌మెన్ సొసైటీకి పనిని కేటాయించాలన్నారు. ఇందుకోసం సాంకేతిక అంశాలతో కూడిన నివేదికని వారంలో జలవనరుల శాఖ అధికారులు అందించాలని ఆదేశించారు. లింగాయపాలెం స్టాక్ పాయింట్‌ని నిర్వహించిన స్వయం సహాయక సంఘాలకు పెండింగ్‌లో ఉన్న ఇసుక లోడింగ్ ఛార్జీలను తహసీల్దార్ నుంచి నివేదిక అందిన వెంటనే మంజూరు చేయాలన్నారు. పట్టాభూముల్లో ఇసుక తవ్వకాలకు అవసరమైన అనుమతులు కూడా త్వరితగతిన ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌వో ఎన్‌ఎస్‌కే ఖాజావలి, జిల్లా గనుల అధికారి ధూళిపాళ్ల ఎస్ వెంకటసాయి, గుంటూరు ఆర్‌టీవో శ్రీహరి, భూగర్భ జలవనరుల శాఖ డీడీ వందనం, డీపీవో సాయికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ కల్యాణ చక్రవర్తి, కేసీ డివిజన్ ఈఈ రవికిరణ్, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ ఎండీ నజీమ బేగం, ఆర్‌డీవో కే శ్రీనివాసరావు, కొల్లిపర, తాడేపల్లి తహసీల్దార్లు సిద్ధార్థ, డీ సీతారామయ్య పాల్గొన్నారు.

అర్హత ఉన్న వారికే కౌలు రైతు కార్డులు అందాలి

గుంటూరు సిటీ, మే 26 (ఆంధ్రజ్యోతి) : కౌలు రైతు కార్డులు అర్హత ఉన్న వారికి మాత్రమే అందేలా చూడాల్సిన బాధ్యత మండల స్థాయి వ్యవసాయ అధికారులపై వుందని ఎక్స్ అఫీషియో కార్యదర్శి బి.రాజశేఖర్ అన్నారు. రాష్ట్ర సచివాలయం నుంచి రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, సీసీఎల్‌ఏ జయలక్ష్మి, వ్యవసాయ శాఖ ఎక్స్ అఫీషియో కార్యదర్శి బి.రాజశేఖర్ కౌలు రైతు గుర్తింపు కార్డుల మంజూరు, అన్నదాత సుఖీభవ పథకంపై కలెక్టర్లు, సంయుక్త కలెక్టర్లతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ ఖరీఫ్‌లో వాస్తవంగా పంటల సాగు చేస్తున్న కౌలు రైతులు అందరికీ సీసీఆర్సీ కార్డులు అందించేందుకు క్షేత్రస్థాయిలో వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులు సమన్వయంతో పని చేసేలా కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అదేవిధంగా అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి అర్హులైన రైతుల వివరాలను వెబ్ ల్యాండ్‌లో గ్రామ, మండల స్థాయి అధికారులు పూర్తి స్థాయిలో తనిఖీ చేసిన జాబితాలను రెండు రోజుల్లో అందించాలన్నారు. వెబ్ ల్యాండ్ రైతుల ఆధార్ నెంబర్లు తప్పులు ఉంటే రెవిన్యూ అధికారుల ద్వారా సరి చేయించి వివరాలను అందించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ కలెక్టరేట్‌లోని జిల్లా సంయుక్త కలెక్టర్ ఛాంబర్ నుంచి జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఏ భార్గవ్ తేజ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నున్నా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


పూర్తయిన మరుగుదొడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నసీర్

మరుగుదొడ్ల నిర్మాణం సామాజిక బాధ్యత

● కళాశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నాం

● మరుగుదొడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): మరుగుదొడ్ల నిర్మాణం మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక అని, వాటి నిర్మాణం సామాజిక బాధ్యత అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. గుంటూరులోని ప్రభుత్వ మహిళా కళాశాలలో నిర్మించిన 39 టాయిలెట్లను సోమవారం ఎమ్మెల్యే నసీర్ ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.38 లక్షలు, ఎమ్మెల్యే ఆధ్వర్యంలోని స్పెషల్ ఫండ్ నుంచి రూ.25 లక్షలతో ఈ మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ బాలికల విద్యాలయాలలో టాయిలెట్ల నిర్మాణం అనేది బాధ్యతగా తీసుకున్నామని తెలిపారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వంలో విద్యాలయాల్లో మౌలిక సదుపాయాలు కల్పనే లక్ష్యంగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. జూనియర్ మహిళా కళాశాలలో ఎన్నో ఏళ్లుగా సౌకర్యాలలేమి కనిపిస్తోందని, ఈ విషయాన్ని తన దృష్టికి తెచ్చిన వెంటనే స్పందించానని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు తెప్పించుకోవడంతోపాటు ప్రత్యేక ఫీజు ఫండ్ ద్వారా సుమారు 60 లక్షలతో 39 టాయిలెట్ల నిర్మాణాన్ని పూర్తి చేశామని చెప్పారు. తిరిగి కళాశాల ప్రారంభమయ్యే సమయానికి టాయిలెట్లు విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొచ్చామని, ఈ విషయంలో కళాశాల యాజమాన్యం కృషి అభినందనీయమని ఎమ్మెల్యే కొనియాడారు. రాష్ట్రంలో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ అందించే దిశగా సీఎం చంద్రబాబు నాయుడు, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పోతురాజు సమత, డివిజన్ అధ్యక్షుడు జీజ, ప్రిన్సిపాల్ సునీత, ఆర్ఐఓ జుబేర్, కోట పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.


గుంతను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

కార్మికులు, సూపర్‌వైజర్లు ఇతర విధుల్లో ఉండకూడదు

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, మే 26(ఆంధ్రజ్యోతి) : నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగ కార్మికులు, సూపర్‌వైజర్లు ఇతర విధుల్లో ఉండడానికి వీలులేదని, వారికి కేటాయించిన పారిశుధ్య పనుల్లోనే ఉండాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రజారోగ్య అధికారులకు స్పష్టం చేశారు. సోమవారం జీటీ రోడ్డు, కేవీపీ కాలనీ రోడ్డుల్లోని పలు ప్రాంతాల్లో పర్యటించి, ప్రజారోగ్య, ఇంజినీరింగ్ అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజారోగ్య కార్మికులుగా ఉన్న వారు పారిశుధ్య పనులు కాకుండా సూపర్‌వైజర్ల పేరుతో ఉంటున్నారని, వారికి తక్షణం పారిశుధ్య విధులు కేటాయించాలని ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. కేవీపీ కాలనీ మెయిన్ రోడ్డు గోతులతో నిండి ఉందని, రోడ్డు నిర్మాణానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని డీఈఈని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, డీఈఈ మధుసూదన్, బయాలజిస్ట్ రామారావు, ఎస్ఎస్ రాజేష్, సచివాలయ ఏఈ ప్రసాద్, శానిటరీ ఇన్స్పెక్టర్ రాజేశ్వరి, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజల అర్జీల పరిష్కారానికి సత్వర చర్యలు

గుంటూరు కార్పొరేషన్, మే 26 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు ఇస్తున్న అర్జీల్లోని ఫిర్యాదులకు సంబంధించి, సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. సోమవారం కమిషనర్ ఆదేశాల మేరకు డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాస్‌లు కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్లు తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి 12 ఫిర్యాదులు అందుకొని, మాట్లాడుతూ అర్జీల పరిష్కార పురోగతిపై కమిషనర్ చాంబర్‌కు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం జరిగిన పీజీ ఆర్ఎస్ ద్వారా 30 ఫిర్యాదులు అందుకొని మాట్లాడుతూ పట్టణ ప్రణాళిక విభాగం 11, ఇంజినీరింగ్ విభాగం 9, రెవెన్యూ విభాగం 3, ప్రజారోగ్య విభాగం 3, ఉపా సెల్ విభాగం 1, అకౌంట్స్ విభాగానికి సంబంధించి 3 ఫిర్యాదులు అందాయన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, ఈఈ సుందరరామిరెడ్డి, బయాలజిస్ట్ రామారావు, మేనేజర్ బాలాజీ, బాషా, విభాగాల సూపరింటెండెంట్లు, ఎస్ఎస్‌లు పాల్గొన్నారు.

నేడు నగరంలో యోగాంధ్ర ర్యాలీ

గుంటూరు కార్పొరేషన్, మే 26 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన యోగాంధ్ర 2025 కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం 7 గంటలకు బృందావన్ గార్డెన్స్ ఎన్టీఆర్ మునిసిపల్ స్టేడియం నుంచి లక్ష్మీపురం మదర్ థెరిస్సా విగ్రహం వరకు ర్యాలీ జరుగుతుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ర్యాలీలో కలెక్టర్, అధికారులు పాల్గొంటారని, నగరంలోని యువత, సీనియర్ సిటిజన్స్, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 21 నుంచి జూన్ 21 వరకు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర 2025లో నగర ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా అవగాహన కలిగించడానికి ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

మురుగు కాలువలో శిశువు మృతదేహం


మృతశిశువు

గుంటూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు నగరంలో ఓ అమానుష ఘటన వెలుగుచూసింది. లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సంగడిగుంట ఇందిరా ప్రియదర్శిని కాలనీ మూడవ లైన్ వద్ద మురుగు కాలువలో సోమ వారం ఉదయం శిశువు మృతదేహం దర్శనమిచ్చింది. అప్పుడే పుట్టిన శిశువును ఓ కసాయి తల్లి దారుణంగా మురుగుకాలువలో పడేసింది. పుట్టగానే బిడ్డ చనిపోయిందా లేదా బతికుండగానే కాలువలో పడేసారా అనేది తెలియరాలేదు. ఏదిఏమైనా నవ మాసాలు మోసి జన్మనిచ్చిన శిశువును ఇలా మురుగు కాలువపాలు చేయడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికుడు జగన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు లాలాపేట పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పై నుంచి మురుగు కాలువలో మృతదేహం కొట్టుకువచ్చి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు.

షెడ్డు పైనుంచి పడి కూలీ మృతి

గుంటూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : అమరావతి రోడ్డులోని కారు సర్వీసింగ్ సెంటర్‌లో షెడ్డు పైనుంచి పడి కూలీ మృతి చెందాడు. అరండల్‌పేట పోలీసుల కథనం మేరకు.. విశాఖపట్నం జిల్లాకి చెందిన వెల్లేటి వెంకట రమణ(67) పది సంవత్సరాల క్రితం కూలిపనుల నిమిత్తం గుంటూరు వలస వచ్చాడు. ఈ క్రమంలో 26న నెహ్రూనగర్ 1 వ లైను వద్ద ఉండగా బండ్లమూడి శ్రీధర్ వచ్చి వెంకటరమణ, మరో ఇద్దరినీ కలిపి అమరావతి రోడ్డులోని మారుతి కార్ సర్వీస్ సెంటర్‌లో పనికి తీసుకొని వెళ్లినట్లు, అక్కడ వెంకట రమణ ట్రాన్స్‌ఫరెన్స్ లైటింగ్ షెడ్డు పైకి ఎక్కి పని చేస్తూ ప్రమాదవశాత్తు కింద పడి చనిపోయినట్లు కుమార్తె సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఖాకీ ముసుగులో నయవంచకుడు

● పెళ్లయిన విషయం దాచి రెండో పెళ్లి

● పోర్న్ వీడియోలు చూపించి లైంగిక వేధింపులు

● మూత్రం తాగించి చిత్రహింసలు

● భర్త, అత్తమామల వేధింపులపై ఎస్పీకి బాధితురాలి ఫిర్యాదు

గుంటూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : ఖాకీ ముసుగులో ఓ నయవంచకుడు చేసిన మోసాలు, సాగించిన అకృత్యాలు కలకలం రేపుతున్నాయి. పెళ్లయిన పది రోజులకే మొదటి భార్యను తరిమేశాడు. గతంలో తనకు పెళ్లి అయిందనే విషయాన్ని దాచి రెండో పెళ్లి చేసుకున్నాడు. హోంగార్డుగా పని చేస్తున్న అతడు తాను కానిస్టేబుల్‌నని చెప్పి మోసం చేసి రెండో పెళ్లి చేసుకున్నాడు. అదనపు కట్నం కోసం భార్యను భర్త, అత్తమామలు వేధింపులకు గురి చేశారు. మరోవైపు భర్త ఆమెకు పోర్న్ వీడియోలు చూపిస్తూ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. అంతేగాక ఆమెను పుట్టింటికి వెళ్లకుండా చేయాలనే కోపంతో ఆమెతో మూత్రం కూడా తాగించాడు. దీంతో బాధితురాలు సోమవారం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించడంతో ఈ దారుణ ఉదంతం వెలుగు చూసింది. బాధితురాలు ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పాత గుంటూరులోని అల్లినగర్ శివారు సూర్యనగర్‌కి చెందిన తనకు, పాత గుంటూరులోని రంగా బొమ్మ సెంటర్ ప్రాంతానికి చెందిన యువకుడితో గత ఏడాది ఆగస్టు 23న ద్వారక తిరుమలలో వివాహం జరిగిందని బాధిత యువతి పేర్కొంది. పెళ్లికి ముందు తాను కానిస్టేబుల్‌నని చెప్పి పెళ్లి చేసుకున్నాడన్నారు. తీరా పెళ్లయిన వారానికి అతను కానిస్టేబుల్ కాదని హోంగార్డు అని తెలిసిందని ఆమె వాపోయింది. ఈ విషయం తాను తన తల్లిదండ్రులకు చెపితే అల్లుడ్ని, అతని కుటుంబ సభ్యులను ఈ విషయం గురించి అడగ్గా తమ తల్లిదండ్రులపై దాడి చేసి కొట్టి ఇంటి నుంచి గెంటి వేశారన్నారు. హోంగార్డు గతంలో పొత్తూరుకు చెందిన యువతిని మొదట వివాహం చేసుకుని పెళ్లయిన వారం రోజులకే ఆమెను హింసించి భర్త, మామ ఇంటి నుంచి తరిమేశారన్నారు. భర్త అత్తమామల వేధింపులు తట్టుకోలేక రెండు నెలల క్రితం తాను పుట్టింటికి వచ్చేశానని అన్నారు. తనకు పోలీస్ శాఖలో అందరూ తెలుసని, నీవు ఏమి చేయలేవని, నీపైన, నీ కుటుంబ సభ్యులపైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టించి జైలుకు పంపుతామని బెదిరించాడన్నారు. ప్రస్తుతం తన భర్త హోంగార్డు జిల్లా కోర్టులోని ఒక పీపీ వద్ద పని చేస్తున్నాడని తెలిపారు.

ఆర్టీసీ బస్సులో నగల బాక్స్ కొట్టేశారు

● నెలరోజులైనా కేసు నమోదు చేయలేదని ఎస్పీకి ఫిర్యాదు

ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న తన బ్యాగులోని నగల బాక్సును దొంగలు కొట్టేశారని, దీనిపై అదే రోజు పోలీసులకు ఫిర్యాదు చేసినా అటు బాపట్ల, ఇటు గుంటూరు పోలీసులు ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ నెల రోజులు గడిచినా ఇంతవరకు కేసు నమోదు చేయకపోగా ఎటువంటి చర్యలు తీసుకోలేదని గుంటూరులోని బ్రాడీపేటకు చెందిన గుగ్గిలం నాగలక్ష్మి సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. గత నెల 19న తాను గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌లో రేపల్లె వెళ్లే బస్సు ఎక్కి చెరుకుపల్లిలో దిగాను అని అన్నారు. బస్సు దిగిన తర్వాత చూసుకుంటే బ్యాగు సైడు జిప్పు తీసి లోపలవైపు బాక్‌గ్రౌండ్ కత్తిరించి అందులో ఉన్న నగల బాక్సును అపహరించుకుపోయారన్నారు. దీనిపై అదే రోజు చెరుకుపల్లి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశానన్నారు. ఆ తర్వాత పాత గుంటూరు పోలీస్‌స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పాతగుంటూరు సీఐ పోలీస్ సిబ్బందిని పంపగా ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు ఎక్కిన 29వ నెంబర్ ప్లాట్ ఫామ్ వద్ద సీసీ కెమెరాలను పరిశీలించగా అవి పని చేయడం లేదని తేలిందన్నారు. దీనిపై పాతగుంటూరు, చెరుకుపల్లి పోలీసులు కేసు నమోదు చేయలేదన్నారు చివరకు రేపల్లె సీఐ వద్దకు వెళ్తే చెరుకుపల్లి వెళ్లాలని చెప్పారని అన్నారు. బాక్స్‌లో 8 సవర్ల బంగారు ఆభరణాలు ఉన్నాయన్నారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు కేసు నమోదు చేసి నిందితులను పట్టుకుని తన బంగారు ఆభరణాలు తనకు ఇప్పించాలని ఆమె పోలీస్ కార్యాలయంలో ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.


బదిలీలకు దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన ఉపాధ్యాయులు

కొనసాగుతున్న ఉపాధ్యాయుల బదిలీ దరఖాస్తు ప్రక్రియ

గుంటూరు(విద్య), మే 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం మంగళవారంతో ముగియనుంది. దీంతో సోమవారం భారీ సంఖ్యలో టీచర్లు దరఖాస్తు చేసుకున్నారు. గుంటూరు బ్రాడీపేటలోని యూటీఎఫ్ కార్యాలయంలోని హెల్ప్ సెంటర్లో టీచర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్ మాట్లాడుతూ కచ్చితంగా బదిలీ కావలసిన టీచర్లు, సాధారణ బదిలీ కోరుకునే వారు మంగళవారం లోగా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. సాఫ్ట్‌వేర్‌లో ఏవైనా తేడాలు ఉన్నప్పటికీ దరఖాస్తు మాత్రం చేసుకోవాలని అన్నారు. పొరపాట్లను తదుపరి గ్రీవెన్స్‌లో సరిచేసే అవకాశం ఉంటుందన్నారు. టీచర్లకు ఉచితంగా సర్వీస్ చేయడానికి యూటీఎఫ్ కార్యాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశామని తెలిపారు. మిగిలిన టీచర్లు దరఖాస్తు చేయాలని, యూటీఎఫ్ హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. దీంతోపాటు బదిలీలు, ప్రమోషన్లకు సంబంధించిన సమస్యలు ఏవైనా ఉంటే యూటీఎఫ్ కార్యాలయం సంప్రదించాలని సూచించారు.

పర్యాటకులపై విచక్షణ రహితంగా దాడి

● కొండవీడు కోటలో కాంట్రాక్టర్ వర్గీయుల దారుణం

● కారు అద్దాలు ధ్వంసం

● తల్లి ముందే కూతురుపై దాడి, గాయాలు

● కాళ్లు పట్టుకుని ప్రాధేయపడినా వదలని వైనం

● 112కు ఫోన్ చేసినా, యడ్లపాడు పోలీసులకు చెప్పినా కానరాని స్పందన

గుంటూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రాంతమైన కొండవీడు కోటలో కాంట్రాక్టర్ వర్గీయులు పర్యాటకులపై విచక్షణ రహితంగాగా దాడి చేశారు. తల్లి కళ్ల ముందే 17 ఏళ్ల కూతురిని జుట్టు పట్టుకొని ఈడ్చుకుంటూ వెళ్లి అత్యంత దారుణంగా వ్యవహరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వివరాల్లోకెళ్తే.. నగరంలోని మిర్చియార్డు రోడ్డులో గల సాయినగర్ లక్ష్మీప్రియ అనే మహిళ నివాసం ఉంటోంది. తన భర్త, కూతురు, మేనల్లుడితో కలిసి కారులో సోమవారం సాయంత్రం కొండవీడు కోటకు వెళ్లారు. అక్కడ గేటు ఎంట్రన్స్‌లోనే తమ నుంచి డబ్బులు కట్టించుకున్నారని బాధితురాలు తెలిపింది. కొండపైకి వెళ్లిన తర్వాత అక్కడ సెల్ఫీ తీసుకుంటుండగా.. అక్కడ పని చేసే ఓ యువకుడు టికెట్ తీసుకోవాలని అడిగాడు. ఈ విషయమై వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అనంతరం లక్ష్మీప్రియ కిందకి వస్తుండగా.. కింద టోల్గేట్ వద్ద సుమారు 25 మంది వారిపై దాడికి పాల్పడ్డారు. అక్కడి నుంచి తప్పించుకుని వస్తుండగా.. కొత్తపాలెం గ్రామంలో రోడ్డుకు అడ్డంగా వాహనాలు పెట్టి తమ కారును అటకాయించి తమపై దాడి చేశారని లక్ష్మీప్రియ తెలిపింది. కారు అద్దాలు ధ్వంసం చేశారని, కాళ్లు పట్టుకొని ప్రాధేయపడినా వదిలిపెట్టకుండా దారుణంగా కొట్టారని పేర్కొంది. తన భర్త ముని కోటేశ్వరరావు రెండు చేతులు వెనక్కు విడిచి పట్టుకుని తమ కుమార్తెపై దాడి చేశారని, తనను తీవ్రంగా కొట్టారని.. వారి దాడి నుంచి ప్రాణ రక్షణ కోసం కారులో దాక్కుని డోర్లు బ్లాక్ చేసుకున్నప్పటికీ వదిలిపెట్టలేదన్నారు. దీనిపై 112కు ఫోన్ చేయగా సకాలంలో పోలీసులు స్పందించలేదన్నారు. చివరకు ఎక్కడైనా పోలీసులకు ఫిర్యాదు చేస్తే చంపేస్తామని బెదిరించారన్నారు. దీనిపై యడ్లపాడు సీఐకు ఫోన్ చేస్తే ఆయన నుంచి కూడా స్పందన రాలేదన్నారు. అదేమంటే తాము ప్రభుత్వానికి రూ.30 లక్షలు చెల్లించి కాంట్రాక్టు దక్కించుకున్నామని.. అక్కడ పనిచేసే సిబ్బందికి యూనిఫాం, ఐడెంటిటీ కార్డు లేకపోవడంతో ప్రశ్నించినందుకు దాడి చేసి కొట్టారన్నారు. దీనిపైన తాను స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కార్యాలయానికి ఫోన్ చేసి ఫిర్యాదు చేశామన్నారు. యడ్లపాడు పోలీస్‌స్టేషన్ లో కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తాము జనసేన పార్టీ వారమని, తమను ఏమి చేయలేరంటూ గ్రామస్తులందరూ భయభ్రాంతులకు గురి చేసి కొట్టారన్నారు. తాముకూడా జనసేన పార్టీనే అని చెప్పినప్పటికీ వినిపించుకోలేదని వాపోయారు. మంగళవారం మంగళగిరిలోని జనసేన రాష్ట్ర పార్టీ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తామని తెలిపారు. ఈ విషయాన్ని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఎక్కడ కూడా జనసేన కార్యకర్తలు భవిష్యత్తులో ఇటువంటి దాడులు, దౌర్జన్యాలకు పాల్పడకుండా ఉండేలా పవన్ కల్యాణ్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

గుంటూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. సంజీవయ్య నగర్ 7వ లైనుకి చెందిన గనిపిసేని శివ రామకృష్ణ (36) అవివాహితుడు. కిల్లీ కొట్టులో గుమస్తాగా పని చేస్తూ జీవిస్తుంటాడు. 2020 సంవత్సరం నుంచి గుండె జబ్బు, ఇతర అనారోగ్య కారణాలతో బాధపడుతున్నాడు. జబ్బులు తగ్గకపోవటంతో జీవితంపై విరక్తి చెంది చనిపోవాలనే ఉద్దేశంతో 24న పాదరసం, గడ్డి మందు కూల్ డ్రింక్‌లో కలుపుకొని తాగాడు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ పోలీసులకి వాంగ్మూలం ఇచ్చి సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుని వాంగ్మూలం మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్వీఆర్ జేసీలో హెచ్ఎస్‌బీసీ ప్రాంగణ ఎంపికలు

గుంటూరు(విద్య), మే 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడవరంలోని ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో బ్యాంకింగ్ రంగంలో అంతర్జాతీయ స్థాయిలో విశేష సేవలందిస్తున్న హెచ్ఎస్‌బీసీ సంస్థ సోమవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్యాంపస్ ఇంటర్వ్యూల్లో రూ.9 లక్షల వార్షిక ప్యాకేజీతో విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని తెలిపారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్, అకడమిక్ అండ్ ఆర్ అండ్ డి డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర మాట్లాడుతూ సీఎస్‌ఈ విభాగంలో ఏ.సాయి దుర్గ, సీహెచ్ లావణ్య, సీహెచ్ లక్ష్మీశ్రీ, సీఎస్‌బీఎస్ విభాగంలో జి.దివ్య తదితరులు ఉద్యోగాలు సాధించారని వివరించారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంత జీవనం

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): కాలానుగుణంగా మారిన దైనందిన జీవితంలో ప్రజలు ఆందోళనకర స్థాయిలో మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, ఈ ఒత్తిడి నుంచి బయటపడాలంటే నిత్యం దైవారాధన ఒక్కటే మార్గమని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. హనుమజ్జయంతి మహోత్సవాల్లో భాగంగా శ్రీనివాసరావుతోటలోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో సోమవారం ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన భారీ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత మాధవికి ఆలయ పూజారి కోగంటి పవన్ కుమార్, మహిళా భక్తులు ఘన స్వాగతం పలికారు. మహోత్సవాల్లో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షుడు పుప్పాల నాగయ్య, నారదాసు కోటేశ్వరరావు, పత్తి కొండలు, శివ నాగేశ్వరరావు, నరసింహారావు, తోట శంకరరావు, రాసంశెట్టి బుజ్జి, రాయల్, కోటేశ్వరరావు, ఆంజనేయులు, మోహన్ దాస్, కనకమహాలక్ష్మి, కేశవదాసు, పాలకాయల శివ, ఆళ్ళ హరి, రాజేశ్వరి, కోటేశ్వరి పాల్గొన్నారు.


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి, మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు తదితరులు

పశ్చిమలో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్

● త్వరలో అన్ని డివిజన్లలో అమలుకు చర్యలు

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు కార్పొరేషన్, మే 26 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు పశ్చిమ నియోజకవర్గం 21వ డివిజన్‌లో ఎమ్మెల్యే గళ్ళా మాధవి, మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం స్పెషల్ శానిటరీ డ్రైవ్ నిర్వహించారు. ప్రయోగాత్మకంగా ఈ స్పెషల్ శానిటేషన్ చేపట్టారు, త్వరలో అన్ని డివిజన్లలో అమలుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే మాధవి అన్నారు. తొలుత కేవీపీ కాలనీ, శశాంక్ గోయల్ కాలనీలో పర్యటించారు. శశాంక్ గోయల్ కాలనీలో రోడ్డును ఆక్రమించి ఇల్లు నిర్మించటం గుర్తించి స్థానిక అధికారుల మీద ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆక్రమణలకు పాల్పడితే సహించమని, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి సమన్వయంతో పని చేయండని సూచించారు. కాలువలు తీయటం లేదని, ఖాళీ స్థలాలు అధికంగా ఉండటం వలన మురుగు నీరు చేరుతుందని ప్రజలు ఫిర్యాదు చేశారు. ఖాళీ స్థలాలలో బోర్డులు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి సూచించారు. 21వ డివిజన్ మొత్తం స్పెషల్ శానిటరీ డ్రైవ్ నిర్వహించటం జరిగిందని, దాదాపు 150 మందితో ఈ డ్రైవ్ చేపట్టటం జరిగిందని, ప్రజలు కూడా పరిసరాల పరిశుభ్రతకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


పూసపాటి కృష్ణ సూర్య కుమార్‌ను సత్కరిస్తున్న కేఎస్ లక్ష్మణరావు

పూసపాటి కృష్ణ సూర్య కుమార్ మేధాశక్తి ప్రశంసనీయం

● మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు(తూర్పు), మే 26(ఆంధ్రజ్యోతి) : పెద్దగా ఉన్నత డిగ్రీలు చదువుకోని పూసపాటి కృష్ణ సూర్య కుమార్ రెండుసార్లు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించడం ఆయన మేధాశక్తికి, ప్రజ్ఞా పాటవాలకు నిదర్శనమని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. బ్రాడీపేట, యూటీఎఫ్ కార్యాలయంలో సూర్యకుమార్ సత్కార సభ నిర్వహించారు. కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ వాట్సాప్ మాధ్యమం ద్వారా తన అర్థమెటిక్ ఫార్ములాతో ఎమ్మెస్ ఎక్సెల్ షీట్ ద్వారా 10, 48, 574 గడులలో అంతే సంఖ్యలో కేవలం ఒక్క గంటలో జవాబులు రాసి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం పొందడం అభినందనీయమన్నారు. కృష్ణకుమార్ త్వరలో గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పూసపాటి నాగమణి, యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్, కళాధర్, వెలగా వినోద్, వాసుదేవ శర్మ, రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఉపసంహరించుకోవాలి

గుంటూరు(తూర్పు), మే 26(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగార ప్రైవేటీకరణ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కును పరిరక్షించుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. అనంతరం ఇన్‌చార్జ్ కలెక్టర్ ఏ భార్గవతేజకు వినతి పత్రం అందజేశారు. నిరసనల్లో దండా లక్ష్మీనారాయణ, కూరపాటి కోటయ్య, అకిటి అరుణ్‌కుమార్, మేడా హనుమంతరావు, పుప్పాల సత్యనారాయణ, పచ్చల శివాజీ పాల్గొన్నారు.

నల్లపాడులో అక్రమంగా లేఅవుట్ ఏర్పాటు

● వైసీపీ నాయకుల అండదండలతో బాధితులను బెదిరిస్తున్నారు

● కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన హైకోర్టు న్యాయవాది తిరుపాల్

గుంటూరు కార్పొరేషన్, మే 26 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని నల్లపాడు ప్రాంతంలో అనుమతులు లేకుండా లేఅవుట్ ఏర్పాటు చేసి ప్రజలను మోసగించి కోట్లాది రూపాయలు అక్రమంగా వసూలు చేస్తున్నారని హైకోర్టు న్యాయవాది బీపీ తిరుపాల్ సోమవారం కమిషనర్ పులి శ్రీనివాసులకు ఫిర్యాదు చేశారు. వైసీపీ నాయకుల అండదండలతో డబ్బులు కట్టిన బాధితులపై బెదిరింపులకు పాల్పడుతున్నారని, తక్షణమే ఆ సంస్థ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. నల్లపాడు గ్రామపంచాయతీ పరిధిలో వైట్ ఫీల్డ్ గేటెడ్ కమ్యూనిటీ పేరు మీద 66 విల్లాస్‌తో వెంచర్ ఏర్పాటు చేశారని తెలిపారు. విరించి కన్‌స్ట్రక్షన్ ఎల్ఎల్‌పీ అండ్ కొటారియా ఇన్‌ఫ్రా పేరుమీద మేనేజింగ్ పార్టనర్ నెల్లూరు వంశీకృష్ణ, పి.పరశురాం రెడ్డి, కొరటిపాటి ఉదయ్ భాస్కర్ తదితరులు వెంచర్ ఏర్పాటు చేసి మూడు సంవత్సరాలు గడుస్తుందన్నారు. విల్లా నెంబర్ నాలుగు కొనుగోలు చేశానని, తాను రూ.5 లక్షల అడ్వాన్సు, రూ.35 లక్షల చెక్కు, మరో రూ.20 లక్షల నగదు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. 2023 మే 7వ తేదీన ఈ వెంచర్ ప్రారంభించారని ఇంతవరకు ఒక్క పని కూడా మొదలుపెట్టలేదని, దీంతో డబ్బులు తిరిగి ఇవ్వాలని అడుగుతున్నప్పటికీ పట్టించుకోకుండా వైసీపీ నాయకుల ద్వారా బెదిరిస్తున్నారని బాధితుడు తిరుపాల్ ఆవేదన చెందారు.

నగరంలో 'పోలీసుల పల్లె నిద్ర'

గుంటూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : నగరంలో పోలీస్ అధికారులు పల్లె నిద్ర కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, కొత్తపేట సీఐ ఎం.వీరయ్య, ఎస్ఐ సుబ్బారావు తదితరులు మోతిలాల్ నగర్ 1వ లైన్‌లో పల్లెనిద్ర ప్రోగ్రాంను నిర్వహించారు. అదేవిధంగా వెస్ట్ డీఎస్పీ అరవింద్ ఆధ్వర్యంలో శారదాకాలనీలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ బహిరంగ మద్యపానం, గంజాయి, మహిళలపై జరుగుతున్న నేరాలు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయా నేరాలకు పాల్పడే వారి పట్ల కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. స్థానిక ప్రజలతో మమేకమై ప్రస్తుతం జరుగుతున్న అసాంఘిక నేరాలపై అవగాహన కల్పించారు. ఇటువంటి నేరాలు చేసిన వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకొంటామని తెలిపారు. అక్కడ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు గురించి తెలుసుకున్నారు. అలాగే ఎల్ఆర్ కాలనీలో లాలాపేట సీఐ శివప్రసాద్ స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

మద్యం మత్తులో యువకుడి ఆత్మహత్య

గుంటూరు కార్పొరేషన్, మే 26 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై కేసు నమోదు చేసినట్లు పాత గుంటూరు పోలీసులు సోమవారం తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.... పాత గుంటూరు పరిధిలోని మృత్యుంజయ నగర్ కు చెందిన ఎం సాయి కుమార్(24) మద్యానికి బానిస అయ్యాడు. ఇంట్లో భార్య, తల్లితో గొడవపడుతున్నాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం భార్య ఊరెళ్ళిపోగా ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని చనిపోయాడు.

రాజకీయ.. రక్తచరిత్ర



కష్టించే మనస్తత్వం, పంటలు పండే సారవంతమైన భూములు, పచ్చని పంట పొలాలు ఉన్నప్పటికీ గ్రామ పెత్తనం కోసం అనాగరికంగా హత్యలకు పాల్పడడం ఆ గ్రామం స్పెషాలిటీ. పల్నాడు జిల్లాలో అత్యంత ఫ్యాక్షన్ గ్రామమేదైనా ఉందంటే అది వెల్దుర్తి మండలంలోని గుండ్లపాడు గ్రామంగా చెప్పుకోవచ్చు. విద్య, ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకొని పల్నాడులోని అన్ని గ్రామాల్లో మార్పులు కోరుకుంటుంటే దానికి భిన్నంగా ఈ గ్రామంలో మాత్రం కక్షలు, కార్పణ్యాలకు అధిక ప్రాధాన్యత నిస్తున్నారు. పిల్లలకు వారసత్వంగా ఆస్తులు, విద్యను అందించాల్సిన పెద్దలు ఫ్యాక్షన్‌లో పాల్గొని అర్ధాంతరంగా తనువు చాలిస్తూ తరువాత తరం వారికి ఫ్యాక్షన్ మరకలు వారసత్వంగా పంచుతున్నారు. ఇలా గుండ్లపాడు గ్రామంలో ఫ్యాక్షన్‌తో అన్నదమ్ములు, బావా బావమరుదులు, సొంత సామాజిక వర్గం తేడా లేకుండా కుటుంబ పెద్దలను కోల్పోయి ఆయా కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయి నేటికి దుర్భర జీవితాలు కొనసాగిస్తున్నాయి.

- గుండ్లపాడు ఫ్యాక్షన్‌లో 20 మంది మృతి
- ఆర్థికంగా నష్టపోయిన కుటుంబాలు
- ఏ ఒక్క ఘటనలోనూ శిక్ష పడని వైనం
- ఫ్యాక్షన్ ముఠాలకు రాజకీయ అండదండలు

మాచర్లటౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి మండలం గుండ్లపాడు గ్రామంలో 1971లో ప్రారంభమైన ఫ్యాక్షన్ హత్యలు నేటి వరకు 20కు చేరుకున్నాయి. రాజకీయ ఆధిపత్యం కోసం అధికారంలో ఎవరుంటే వారు గ్రామాన్ని ఏలుకుంటూ ప్రత్యర్థులను హతమార్చుతూ గ్రామం నుంచి తరిమేస్తున్నారు. అధికారం వచ్చాక తిరిగి ప్రత్యర్థులపై కక్ష తీర్చుకుంటున్నారు. గ్రామంలో పెరిక, వడ్డెర, ఎస్సీ సామాజిక వర్గాల ప్రజలు అధికంగా ఉన్నారు. పెరిక సామాజిక వర్గం రెండుగా చీలి జెవిశెట్టి పెద నాగయ్య, సాని రామయ్య కాంగ్రెస్ పార్టీ నాయకులుగా, దొంగరి చిన వీరయ్య ఇండిపెండెంట్ అభ్యర్థి జూలకంటి నాగిరెడ్డికి మద్దతు దారుడిగా పెత్తనం సాగించారు. గ్రామంపై ఆధిపత్యం కోసం ఈ రెండు వర్గాల మధ్య జరిగిన దాడుల్లో 1971లో మొదటిసారిగా దొంగరి చిన వీరయ్య హత్య జరిగింది. తరువాత 1989లో తిరిగి ఫ్యాక్షన్ పురుడు పోసుకుంది. కాంగ్రెస్ పార్టీకి ప్రత్యర్థి పార్టీగా నూతనంగా పుట్టుకొచ్చిన టీడీపీ పార్టీల మధ్య వర్గపోరు మొదలైంది. తోట కృష్ణమూర్తి, దొంగరి నాగేశ్వరరావు, చింతా చిన వీరయ్యలు టీడీపీ నాయకులుగా కొనసాగగా 1989లో రెండు వర్గాలు నాటుబాంబులతో దాడులకు దిగారు. ఈ దాడిలో టీడీపీకి చెందిన చింతా పెద వీరయ్య, కాంగ్రెస్ పార్టీకి చెందిన చింతా చిన మల్లయ్యలు హత్యకు గురయ్యారు. 1990లో టీడీపీకి చెందిన సాని కొండలు హత్యకు గురయ్యాడు. కొండలు హత్యకు ప్రతీకారంగా 1991లో కాంగ్రెస్‌కు చెందిన తోట రాములును హత్య చేశారు. తదుపరి టీడీపీకి చెందిన తోట దుర్గా మల్లయ్యను ప్రత్యర్థులు హత్య చేశారు. 1993లో గ్రామాన్ని విడిచి శిరిగిరిపాడులో నివాసముంటూ ప్రత్యర్థుల కోసం నాటుబాంబులు తయారు చేస్తుండగా ప్రమాదవశాత్తూ అవి పేలి దొంగరి నాగేశ్వరరావు, సాని చిన కోటయ్య, సాని పుల్లయ్య, చింతా కొండలు, చింతా పెద కోటయ్య ప్రాణాలు కోల్పోయారు. 1995లో టీడీపీకి చెందిన గుడిబండ్ల బంగారయ్యను ప్రత్యర్థులు హత్య చేశారు. 1996లో వడ్డెర సామాజిక వర్గం రెండు వర్గాలుగా విడిపోయి టీడీపీ, కాంగ్రెస్ గ్రూపుల్లో చేరిపోయాయి. కాంగ్రెస్‌కు చెందిన ఉప్పుతోళ్ల రాములును ప్రత్యర్థులు బాంబులు వేసి హత్యచేశారు. తరువాత ఉప్పుతోళ్ల నాగేశ్వరరావును ప్రత్యర్థులు హత్య చేశారు. 1997లో టీడీపీకి చెందిన దొంగరి నాగయ్య గుండ్లపాడు గ్రామంలో హత్యకు గురయ్యాడు. 1999లో కాంగ్రెస్, టీడీపీ గ్రూపులు రాజీ కుదుర్చుకొని ఫ్యాక్షన్‌కు స్వస్తి పలికారు. తిరిగి 2022 జనవరి 13న టీడీపీకి చెందిన తోట చంద్రయ్యను వైసీపీకి చెందిన చింతా శివరామయ్య హత్య చేశారు. తాజాగా టీడీపీకి చెందిన జెవిశెట్టి వెంకటేశ్వర్లు (మొద్దయ్య), అతని సోదరుడు కోటేశ్వరరావులను ఇటీవల వైసీపీ నుంచి టీడీపీలో చేరిన జెవిశెట్టి శ్రీనివాసరావు (బెబ్బులి), తోట వెంకట్రామయ్యలు హత్యకు పాల్పడ్డారు.



గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో వాహనాలను దహనం చేసిన దృశ్యం



జెవిశెట్టి వెంకటేశ్వర్లు (మొద్దయ్య) మృతదేహం (ఫైల్‌ఫోటో)



జెవిశెట్టి కోటేశ్వరరావు మృతదేహం (ఫైల్)

హత్య కేసులన్నీ రాజీలే..

గుండ్లపాడులో జరిగిన హత్యల్లో ఏ ముఠాకు చెందిన నిందితులకు కూడా శిక్ష పడకపోవడం గమనార్హం. హత్యలు జరిగిన తరువాత బెయిల్ పొంది శిక్ష పడే సమయానికి ఇరువర్గాలు రాజీ కుదుర్చుకోవడం, శిక్షలు పడకుండా బయటపడడం ఆనవాయితీగా మారింది. దీంతో ఏ వర్గానికి కూడా భయం లేకుండా పోయింది. దీనికితోడు రాజకీయ నాయకులు వారి ఎదుగుదల కోసం గ్రామంలో ఫ్యాక్షన్ ముఠాలను పెంచి పోషించడం జరుగుతోంది. ఇలా ఫ్యాక్షన్ ఘర్షణలో కుటుంబ పెద్దలను కోల్పోయి ఆర్థికంగా చితికిపోయి ఆయా కుటుంబాల సభ్యులు తీవ్ర దుర్భర పరిస్థితుల్లోకి నెట్టబడ్డారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ప్రత్యర్థి పార్టీ వారిని గ్రామం నుంచి తరిమివేయడం, ప్రత్యర్థి పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చాక మరలా గ్రామంలోకి వచ్చి కక్షసాధింపులకు పాల్పడడం రివాజుగా మారింది. ఒకే సామాజిక వర్గానికి చెందిన వారైనా, అన్నదమ్ములైనా, బావా బావమరుదులైనా ఫ్యాక్షన్ రక్కసిలో ఇరుక్కొని ప్రాణాలు కోల్పోతున్నారు. గుండ్లపాడు గ్రామంలో విస్తారంగా సారవంతమైన భూములుండి పంటలు పండిస్తూ కష్టించే మనస్తత్వం ఉన్న మహిళామణులున్నప్పటికీ ఆధిపత్యం కోసం పురుషులు ఫ్యాక్షన్ వైపు మొగ్గు చూపి కుటుంబాలను కష్టాల్లోకి నెట్టబడుతున్నారు. ప్రభుత్వాలు సీరియస్‌గా తీసుకొని గుండ్లపాడు గ్రామంలో ఫ్యాక్షన్ మూలాలను సమూలంగా తొలగించి ఆ ప్రజలకు విద్యతోపాటు ఉపాధి అవకాశాలు ఏర్పాటు చేసి మార్పు తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.



ప్రకృతి వ్యవసాయం చేద్దాం.. భూమాతకు జీవం పోద్దామంటూ ఆంధ్రప్రదేశ్ లోగో కనిపించేలా 30 రకాల విత్తనాలతో తన పంట పొలంలో వేసిన సుందర దృశ్యం

ప్రకృతి సేద్యంతో.. భూమాతకు జీవం

- అత్తోటలో ప్రకృతి వ్యవసాయదారుడి వినూత్న ఆకృతిలో సాగు
- పరిశీలించిన కాశ్మీర్, లఢక్ విద్యార్థినులు

తెనాలి, మే 26 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వైపరీత్యాలను నివారించేందుకు సహజ సిద్ధమైన ప్రకృతి సాగు ఎంతో దోహదపడుతుందని, పర్యావరణాన్ని పరిరక్షించే దిశగా ప్రకృతి సాగుకు అందరు మొగ్గు చూపాలంటూ ప్రకృతి వ్యవసాయదారుడు, యర్రు బాపారావు వినూత్న రీతిలో సందేశాత్మక ఆకృతిని చూపుతూ సాగు చేసిన చిత్రం ఆకర్షణగా నిలిచింది. గుంటూరు జిల్లా కొల్లిపర మండలం, అత్తోటకు చెందిన రైతు బాపారావు "ప్రకృతి వ్యవసాయం చేద్దాం.. భూమాతకు జీవం పోద్దాం" అనే అక్షరాలు కనిపిస్తూ దాని మధ్యలో ఆంధ్రప్రదేశ్ మ్యాప్‌ను తీర్చిదిద్దేలా 40 రోజుల క్రితం 30 రకాల విత్తనాలతో నాటు వేశారు. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ న్యాచురల్ ఫార్మింగ్ (ఏపీ సీఎన్ఎఫ్) విధానంలో ముందుకు వెళ్లేలా తమ ప్రకృతి సాగు చిత్రాన్ని ఆవిష్కరించారు. భూమి బాగుంటే మనిషి కూడా బాగుంటాడని, ప్రస్తుతం ఏర్పడుతున్న ప్రకృతి వైపరీత్యాలకు ఊహించని విపత్తులకు పర్యావరణ సమతుల్యత లోపమే కారణమనేది తెలియజేప్పాలనేదే తన ఉద్దేశమని రైతు బాపారావు అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రకృతి సాగు అధ్యయనంలో భాగంగా జమ్మూ కాశ్మీర్, లఢక్ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు సోమవారం అత్తోట వచ్చి ఇక్కడ రైతులు చేపడుతున్న సాగును పరిశీలించారు.

ప్రకృతి సాగు ఎంత మేలు చేస్తుందో అర్థం చేసుకున్నాం..

- తంబీర్ ఖాన్, జమ్మూ కాశ్మీర్



రూరల్ డెవలప్‌మెంట్‌లో పీజీ చేస్తున్న నేను ప్రకృతి సాగును ఆంధ్రప్రదేశ్ చేపడుతున్న రైతుల వివరాలు తెలుసుకుని పరిశీలించేందుకు వచ్చాం. అత్తోట రైతులు చేపడుతున్న సాగు విధానాలు, భూ పరిరక్షణ చర్యలు, మమ్ములను ఆకట్టుకున్నాయి. ప్రకృతి సాగుపై అనేక మెలకువలు తెలుసుకున్నందుకు సంతోషంగా ఉంది.

భూటాన్ సరిహద్దుల్లోనూ ప్రకృతి సాగు చేస్తాం..

- పద్మలాజేష్, భూటాన్ - టిబెట్ సరిహద్దు లఢక్ విద్యార్థిని



ప్రకృతి సాగు వల్ల లాభాలు పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఈ అధ్యయనంలో తెలుసుకున్నాం. భవిష్యత్ తరాలకు మా ప్రాంతంలో వీటిని అందించేందుకు ప్రయత్నం చేస్తాం. భూటాన్ - టిబెట్ సరిహద్దులో కూడా ప్రకృతి సాగు చేపడతాం. మా ప్రాంతాల వారికి ఇక్కడ సాగు విధానాలను తెలియజేసి మెరుగైన ఫలితాలు సాధించడానికి మా వంతు సహకారం అందిస్తాం.

కార్పొరేట్‌కు దీటుగా.. ప్రభుత్వ కళాశాలలు

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏడాది నుంచి సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థిని విద్యార్థులు చదివే ఈ కళాశాలల్ని ఉన్నతంగా తీర్చిదిద్ది మెరుగైన విద్యతోపాటు విద్యార్థులకు అవసరమైన రాష్ట్ర, జాతీయస్థాయి పోటీ పరీక్షలకు శిక్షణను ఇచ్చేందుకు కార్యాచరణ సిద్ధమైంది. నూతన ప్రభుత్వం ఏర్పాటు అయిన తరువాత జూనియర్ కళాశాలల్లో భారీస్థాయిలో సంస్కరణలు ప్రారంభం అయ్యాయి.

- ఎంసెట్, జేఈఈ, నీట్ పరీక్షకు ప్రత్యేక శిక్షణ



గుంటూరు (విద్య), మే 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో 23 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు మరొక ఎయిడెడ్ జూనియర్ కళాశాల ఉన్నాయి ఆ కళాశాలలో దాదాపు 15 వేల మందికి పైగా విద్యార్థులు ఇంటర్ విద్యను అభ్యసిస్తున్నారు. ప్రస్తుతం వీటితోపాటు ప్లస్ టు కళాశాలలు కూడా విద్యార్థులకు అందుబాటులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులకు మెరుగైన శిక్షణ ఇచ్చేందుకు కళాశాలల్లో ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా పూర్తిస్థాయిలో ఫర్నీచర్, తరగతి గదులు, విద్యార్థినీ విద్యార్థులకు అవసరమైన ల్యాబ్ పరికరాలు, ఆటస్థలం, మరుగుదొడ్లు, స్వచ్ఛమైన తాగునీరు కల్పిస్తున్నారు. వీటితోపాటు గత ఏడాదినుంచి విద్యార్థినీ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు నోట్ బుక్స్ అందిస్తున్నారు. ఇంకా అనేక కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు.

పోటీ పరీక్షలకు మెరుగైన శిక్షణ...

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కార్పొరేట్ స్థాయిలో విద్యార్థినీ విద్యార్థులను జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు శిక్షణ అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు ఇందుకోసం గుంటూరు నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను నోడల్ సెంటర్‌గా ఏర్పాటుచేసి ఎంసెట్‌తో పాటు జేఈఈ, జేఈఈ అడ్వాన్స్, నీట్ పరీక్షలకు శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి జిల్లాలోని 23 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్ని అనుసంధానం చేస్తూ ఈ శిక్షణ అందించడానికి ఏడాది కార్యాచరణ సిద్ధం చేశారు. ఇందు కోసం అవసరమైన పుస్తకాలను కూడా ఇంటర్‌బోర్డు త్వరలో విద్యార్థినీ విద్యార్థులకు అందించనుందని అధికారులు చెబుతున్నారు.

పుస్తకాలు పంపిణీ పూర్తి

అవసరమైన పుస్తకాలను ఇప్పటికే పంపిణీ చేశారు. మారిన సిలబస్ కనుగుణంగా ఈ పుస్తకాలను రూపొందించి పంపిణీ చేశారు వేసవి సెలవులకు ముందే ఈ కార్యక్రమాన్ని ఇంటర్ బోర్డు పూర్తి చేసింది.

అవకాశాల్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అందించే సౌకర్యాలను విద్యార్థులకు సద్వినియోగం చేసుకోవాలని ఇంటర్ బోర్డు అధికారులు విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ప్రత్యేకంగా అధ్యాపకుల ద్వారా అడ్మిషన్ల కోసం క్యాంపులు నిర్వహించి ఇక్కడ ఉన్న సౌకర్యాలు వివరించారు. విద్యార్థులకు అవసరమైన సమస్త సౌకర్యాలు ప్రస్తుతం కళాశాలలో అందుబాటులో ఉన్నాయని మెరుగైన బోధన అందించే అధ్యాపకులు అందుబాటులో ఉన్నట్లు వివరించారు.



జనరల్ బోగీలు నాటికలోని ఓ సన్నివేశం

నాటిక పోటీలతో సమాజానికి మంచి సందేశం

- ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నాదెండ్ల, మే 26 (ఆంధ్రజ్యోతి): నాటిక పోటీల ద్వారా సమాజానికి మంచి సందేశాన్ని అందించ వచ్చని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. మండలంలోని సాతులూరు గ్రామంలో నటరత్న ఎన్‌టీఆర్ కళా పరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న తృతీయ జాతీయ స్థాయి పోటీల్లో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని, పలువురికి ఎన్‌టీఆర్ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులను అభినందించారు. కళాకారుడు వీసీహెచ్ ప్రసాదు, పి.ఓబులయ్య, ఆడిటర్ బొల్లేపల్లి శ్రీనివాసరావు, మీరయ్యకు ఎన్‌టీఆర్ అవార్డు అందజేసి సన్మానించారు. కాగా జనరల్ బోగీలు నాటిక పలువురిలో ఆలోచన రేకెత్తించింది. ఒక ఉపాధ్యాయురాలు కుమారుడు జనరల్ బోగీలో ప్రయాణిస్తూ రైల్వే యాక్సిడెంట్‌లో మృతి చెందగా.. న్యాయం కోసం ఆమె చేసిన పోరాటం ప్రేక్షకుల్లో ఆలోచింపజేసింది. రిజర్వేషన్ ఉన్న వారికేనా సాయం అందేది, జనరల్ బోగీల ప్రయాణికులు ఎందుకు అందదంటూ నాటికలోని సన్నివేశాలు ఆకట్టుకున్నాయి. అదే విధంగా రే చీకటి భార్య, భర్తల కథనంతో రూపొందిన దొందుదొందే నాటిక ప్రేక్షకులను నవ్వించింది. అధిక సంఖ్యలో తరలి వచ్చిన ప్రేక్షకులతో నాటిక పోటీలు కోలాహలంగా సాగుతున్నాయి.



బాపట్ల వ్యవసాయ పరిశోధన స్థానం, వ్యవసాయ కళాశాల క్షేత్రం ద్వారా బ్రీడర్, ఫౌండేషన్ సీడ్ రైతులకు అందజేత

బీపీటీ వంగడాల విక్రయం ప్రారంభం

- వ్యవసాయ కళాశాల క్షేత్రం ద్వారా ఫౌండేషన్ సీడ్
- పరిశోధన స్థానం ద్వారా బ్రీడర్ సీడ్

బాపట్ల, మే 26 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని బాపట్ల వ్యవసాయ పరిశోధన స్థానం రైతులకు బ్రీడర్ సీడ్ విక్రయాలు ప్రారంభించింది. అదేవిధంగా వ్యవసాయ కళాశాల క్షేత్రం రైతులకు ఫౌండేషన్ సీడ్ విక్రయిస్తోంది. 30 కిలోల బ్యాగ్‌లను రైతుల అవసరాన్ని బట్టి, ముందుగా దరఖాస్తు చేసుకున్నవారికి ప్రాధాన్యమిస్తూ విక్రయిస్తున్నారు. రుతుపవనాలు ముందుగా రావడం, వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో.. జూన్ నుంచి వెద సాగుకు, నారుమడులు పోసేందుకు అనుకూలంగా ఉంది. దీంతో ముందస్తుగా విత్తనాలు కోసం బాపట్ల పరిసర ప్రాంతాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి రైతులు పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు. బాపట్ల వ్యవసాయ పరిశోధన స్థానంలో బ్రీడర్ సీడ్ బీపీటీ 2595 (తేజ) రకం 30 క్వింటాళ్లు, బీపీటీ 2846 రకం 20 క్వింటాళ్లు, బీపీటీ 2270 (భావపురి సన్నాలు) రకం 60 క్వింటాళ్లు, బీపీటీ 2231 (అక్షయ) రకం 6క్వింటాళ్లు, బీపీటీ 2295 (బాపట్ల మసూరి)రకం 5 క్వింటాళ్లు, బీపీటీ 2841 రకం 15 క్వింటాళ్లు, బీపీటీ 3291 (సోనా మసూరి) రకం 6 క్వింటాళ్లు, బీపీటీ 2782 (భవతి) రకం 30 క్వింటాళ్లు, బీపీటీ 3082 రకం 35 క్వింటాళ్లు, బీపీటీ 2766 రకం 10 క్వింటాళ్లు చొప్పున విత్తనాలు అందుబాటులో ఉంచారు. అదేవిధంగా వ్యవసాయ పరిశోధన స్థానం వద్ద ఫౌండేషన్ సీడ్ బీపీటీ 2846 రకం 84 క్వింటాళ్లు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి. బాపట్ల వ్యవసాయ కళాశాల క్షేత్రం ఫౌండేషన్ సీడ్ విక్రయిస్తోంది. అందులో బీపీటీ 5204 (సాంబ మసూరి), బీపీటీ 2270 (భావపురి సన్నాలు), బీపీటీ 2782 (భవతి), బీపీటీ 2595 (తేజ) రకాల విత్తనాలు 1,560 క్వింటాళ్లు రైతులకు విక్రయించేందుకు సిద్ధం చేసి విక్రయిస్తున్నారు. మొత్తం 3 వేల బ్యాగ్‌లను రైతులకు విక్రయించనున్నట్లు సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఇ.అరుణ తెలిపారు.

బ్రీడర్ సీడ్ 30 కిలోల బ్యాగ్ రూ.2,334



వ్యవసాయ పరిశోధన స్థానం ద్వారా బ్రీడర్ సీడ్ 30కిలోల బ్యాగ్ రూ.2,334, ఫౌండేషన్ సీడ్ బ్యాగ్ రూ.1,450 కు విక్రయిస్తున్నాం. ఇప్పటి వరకు బ్లాక్ రైస్, రెడ్‌రైస్ విత్తనాలు రెండు కిలోల మినీ కిట్‌లను దరఖాస్తు చేసుకున్న రైతులందరికి ఇవ్వడం జరిగింది. మిగిలిన రకాలు అందుబాటులో ఉన్నాయి. డిమాండ్‌ను బట్టి వెరైటీలు పూర్తిగా విక్రయిస్తున్నారు. అవసరమైన రైతులు ముందుగా దరఖాస్తు పెట్టుకొని విత్తనాలు పొందవచ్చు.

- డాక్టర్ బి.కృష్ణవేణి, ప్రధాన శాస్త్రవేత్త, బాపట్ల వ్యవసాయ పరిశోధన స్థానం

రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్

గుంటూరు (విద్య) మే 26 (ఆంధ్రజ్యోతి): గురుకుల జూనియర్ కళాశాలల్లో ప్రవేశం కోసం సోమవారం గుంటూరు పాత బస్టాండ్ సెంటర్లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల ఏపీఆర్జేసీ సెట్ నిర్వహించిన విషయం తెలిసిందే. ఆంధ్ర రీజియన్ పరిధిలోని వివిధ జిల్లాల నుంచి ర్యాంకు సాధించిన విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. ఈ రీజియన్ పరిధిలో తోటకూడి ప్రభుత్వ జూనియర్ కళాశాల, నిమ్మకూరు బాలుర, బాలికల కళాశాల, నాగార్జున సాగర్‌లోని బాలుర కళాశాల, గుంటూరులోని డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ రెసిడెన్షియల్ కళాశాల, వెంకటగిరిలోని రెసిడెన్షియల్ కళాశాలల్లో 299 సీట్లకు ప్రవేశాల కోసం తొలిరోజు 1:5 నిష్పత్తిలో విద్యార్థులను కౌన్సెలింగ్‌కు పిలిచారు. మొత్తం 1,328 మంది విద్యార్థిని విద్యార్థులు కౌన్సెలింగ్ హాజరుకాగా 131మంది బాలురు, 33మంది బాలికలకు సీట్లు కేటాయించారు. మంగళవారం బైపీసీ విద్యార్థులకు, బుధవారం ఎంఈసీ, సీఈసీ గ్రూపులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కోఆర్డినేటర్స్ వెల్లడించారు. కౌన్సిలింగ్ కేంద్రాన్ని ఉర్దూ డీఐ ఎస్‌కే ఎండీ ఖాసిం సందర్శించారు. విద్యార్థులు, సిబ్బందికి కల్పించిన భోజన, ఇతర వసతులను ఆయన పర్యవేక్షించారు.



ఎంపికైన వారికి నియామక ఉత్తర్వులు అందజేస్తున్న కో-ఆర్డినేటర్స్

శిథిలావస్థలు..!

- మరమ్మతులకు నోచుకోని ఇరిగేషన్ కార్యాలయం

బాపట్ల, మే 26 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఏడాది శిథిలావస్థ కాల్వలకు మరమ్మతులు చేపట్టే.. ఇరిగేషన్ అధికారులు.. తాము విధులు నిర్వహించే కార్యాలయానికి మాత్రం మరమ్మతులు చేయించుకోలేక పోతున్నారు. దీంతో శిథిలావస్థ భవనం స్లాబ్ పెచ్చులూడి పడుతున్నాయి. తలుపులు ధ్వంసమై పనికిరాకుండా పోయాయి. అయినప్పటికి అధికారులు అందులోనే ఉండి తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. 1954 సంవత్సరానికి ముందు బాపట్ల పట్టణ నడిబొడ్డున గడియార స్తంభం పక్కనే జీబీసీ రోడ్డులో ఈ భవనాన్ని నిర్మించారు. బాపట్ల వెస్ట్రన్ సబ్ డివిజన్ అధికారులతోపాటు చీరాల డివిజన్ అధికారులు కూడా ఇక్కడే ఉండి.. తమ పరిధిలోని సాగునీటి కాల్వలను పర్యవేక్షిస్తుంటారు. ఇప్పటి వరకు ఈ కార్యాలయం నుండి 58మంది డీఈలు విధులు నిర్వహించారు. అయినప్పటికి పై అంతస్తు శిథిలమైనా పట్టించుకోలేదు. కింద అంతస్తు పటిష్టంగా ఉన్నప్పటికీ.. ఆ తర్వాత నిర్మించిన పై అంతస్తు మాత్రం శిథిలావస్థకు చేరింది. దీంతో అధికారులు కార్యాలయ గదుల్లో ఉండటానికి సిబ్బంది భయపడుతున్న పరిస్థితి నెలకొంది. పైఅంతస్తు ఎప్పుడైనా.. కూలిపోయే ప్రమాదం పొంచి ఉంది.



పూర్తిగా దెబ్బతిన్న ఇరిగేషన్ ఏఈ గది తలుపు పెచ్చులూడి పడుతున్న శ్లాబ్ పై అంతస్తు దృశ్యం



దెబ్బతిన్న ఇరిగేషన్ కార్యాలయం పై అంతస్తు

గుంటూరు రూరల్ వార్తలు

దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, మే 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపు మార్కెట్ యార్డులో సోమవారం జరిగిన వేలంలో 702 బస్తాల పసుపు విక్రయాలు జరిగాయి. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.10,000, గరిష్ఠధర రూ.10,925, మోడల్‌ధర రూ.10,481పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.10,000, గరిష్ఠధర రూ.10,875 మోడల్‌ధర రూ.10,300 పలికాయి.

ఆర్వీఆర్‌అండ్‌జేసీలో హెచ్‌ఎస్‌బీసీ ప్రాంగణ ఎంపికలు

గుంటూరు(విద్య), మే 26(ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడవరంలోని ఆర్వీఆర్‌అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో బ్యాంకింగ్ రంగంలో అంతర్జాతీయ స్థాయిలో విశేష సేవలందిస్తున్న హెచ్‌ఎస్‌బీసీ సంస్థ సోమవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, అకడమిక్, ఆర్‌అండ్‌డీ డైరెక్టర్ కే రవీంద్ర మాట్లాడుతూ సీఎస్ఈ విభాగంలో ఏ సాయి దుర్గ, సీహెచ్ లావణ్య, సీహెచ్ లక్ష్మీశ్రీ, సీఎస్‌బీఎస్ విభాగంలో జీ దివ్య తదితరులు ఉద్యోగాలు సాధించారని వివరించారు.

వార్డుల్లో సమస్యలను పరిష్కరించాలి

పెదనందిపాడు, మే 26 (ఆంధ్రజ్యోతి): వార్డులో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మార్వో వెంకటస్వామికి సోమవారం వినతిపత్రం వార్డు సభ్యులు అందజేశారు. మురుగు కాలువల్లో పూడిక తీయకపోవడం వల్ల మురుగునీరు రోడ్డుపై పారి దోమలు వృద్ధి చెందుతున్నాయని, మురుగుకాలువల్లో జమ్ము పెరిగి విద్యుత్ దీపాలు కూడా సరిగాలేవని ఆ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

రేపటి నుంచి యోగా శిక్షణ తరగతులు

మంగళగిరి, మే 26 (ఆంధ్రజ్యోతి): 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21 నుంచి జూన్ 21వ తేదీ వరకు యోగా మాసోత్సవాలను నిర్వహిస్తున్నట్టు ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా తెలిపారు. దీనిలో భాగంగా ప్రజల్లో యోగా పట్ల అవగాహన పెంపొందించేందుకు ప్రత్యేకంగా గ్రామ, మండల స్థాయిలో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ నెల 28వ తేదీ నుంచి ఉచిత యోగా శిక్షణా తరగతులను ఏర్పాటు చేసి 500 మంది యోగ శిక్షణ పొందిన వారిచే మంగళగిరి ఈద్గా కమ్యూనిటీ హాలు, తాడేపల్లి రామకృష్ణ మిషన్ స్కూల్ ప్రాంగణాల్లో ఐదు రోజుల పాటు యోగ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రతి ఒక్కరూ యోగ శిక్షణలో పాల్గొని ఆరోగ్యకరమై జీవితాన్ని పొందాలని కోరారు. శిక్షణ తరగతుల్లో పాల్గొన దలచిన వారు తమ పరిధిలోని సచివాలయాల్లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. యోగా మాసోత్సవాల్లో భాగంగా ఈ నెల 28వ తేదీన తాడేపల్లి ఉండవల్లి గుహాలయాలు వద్ద, జూన్ 3వ తేదీన శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణ ప్రాంగణం, పదో తేదీన మంగళగిరి ఎకో హిల్ పార్కు వద్ద వెయ్యి మందితో యోగా ప్రదర్శనలను ఏర్పాటు చేయనున్నట్టు తెలియజేశారు.

ఉండవల్లిలో జూదరుల అరెస్టు

తాడేపల్లి(ఉండవల్లి), మే 26 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లిలో పేకాట స్థావరంపై పోలీసులు ఆదివారం రాత్రి దాడులు నిర్వహించి 10మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ. 13500 నగదు స్వాధీనం చేసుకున్నారు. సీఐ కళ్యాణ్‌రాజు ఆదేశాల మేరకు ఎస్‌ఐ ఖాజావలి ఈ దాడులు నిర్వహించారు. పేకాట, కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని, ఎస్ఐ ఖాజావలి తెలిపారు.

160 కేజీల బియ్యం స్వాధీనం

తుళ్లూరు (దొండపాడు), మే 26(ఆంధ్రజ్యోతి): మండల పరధిలోని దొండపాడు గ్రామంలో 160 కేజీల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తరలించటానికి సిద్ధంగా ఉన్న పల్నాడు జిల్లా అమరావతి మండలం ఖమ్మంపాడుకు చెందిన నాగేశ్వరరావు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని బియ్యం స్వాధీనం చేసుకున్నట్టు తుళ్లూరు ఎస్ఐ కలగయ్య తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

డిపాజిట్ల పేరుతో కోట్లు కొల్లగొట్టిన నిందితుల ఆస్తులు సీజ్ చేయాలి

గుంటూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): డిపాజిట్ల రూపంలో కోట్ల రూపాయలు వసూలు చేసిన కేసులో నిందితుల ఆస్తులు సీజ్ చేసి తమను ఆదుకోవాలని బాధితులు కోరారు. ఈ మేరకు సోమవారం పెదనందిపాడు, కాకుమాను మండలాలకు చెందిన పలువురు బాధితులు ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. హైదరాబాద్‌కు చెందిన రాయల రాజారావు అనే వ్యక్తి ట్రిబుల్ ఆర్ పేరుతో కోట్లాది రూపాయల డిపాజిట్లు సేకరించాడన్నారు. బాధితులకు డబ్బుతో పాటు స్థలాల రూపంలో ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేస్తానని మాయ మాటలు చెప్పి మోసం చేశాడన్నారు. దానిపై ఫిర్యాదు పోలీసులు కేసు నమోదు చేశారని, నిందితుని పోలీసులు పట్టుకొచ్చి ఆ తర్వాత వెంటనే వదిలేశారని బాధితుడు వాపోయారు. నిందితుల ఆస్తులు సీజ్ చేస్తే తమకు కొంతవరకు న్యాయం జరుగుతుందని వారు పేర్కొన్నారు..

కొడుకు నుంచి రక్షణ కల్పించండి

ఆస్తి కోసం తమ కొడుకు చిత్రహింసలకు గురి చేస్తున్నాడని, ఆయన నుంచి తమకు రక్షణ కల్పించాలని ప్రత్తిపాడుకు చెందిన బిల్లా పరమేశ్వరరావు అంజమ్మ దంపతులు సోమవారం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు తమకు ముగ్గురు కుమారులు సంతానం ఉండగా, పెద్ద కుమారుడు అనారోగ్యంతో చనిపోయాడు. మిగిలిన ఇద్దరు కుమారులు మద్యానికి బానిసలయ్యారన్నారు. రెండెకరాల పొలాన్ని ఇద్దరికి పంచామన్నారు. తన భార్య అంజమ్మకు పక్షవాతం రావడంతో మంచంలోనే ఉందన్నారు. తమ పేరుతో ఉన్న ఎకరం పొలాన్ని కూడా రాయాలని చిన్న కుమారుడు చిత్రహింసలకు గురి చేస్తున్నాడని అన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారుల అలసత్వం

- తాపీగా కొందరు అధికారులు
- మరి కొన్ని శాఖలు గైర్హాజరు



కార్యక్రమానికి హాజరైన నాలుగు శాఖల అధికారులు

ప్రత్తిపాడు, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి సోమవారం మండల స్థాయిలో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అధికారుల అలసత్వం అలముకుంది. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు అందరూ తప్పనిసరిగా హాజరు కావాల్సి ఉంది. ఏదైనా ప్రజల నుంచి సమస్య వచ్చినప్పుడు ఆయా శాఖల అధికారులు స్పందించి వాటిని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసేందుకు వీలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కాని ఈ కార్యక్రమానికి మండల స్థాయిలో అధికారులు తూట్లు పొడుస్తున్నారు. ఎవరికి వారు వచ్చామా.. వెళ్లామా అన్నట్టుగా తీరిగ్గా కార్యక్రమానికి తాపీగా హాజరవుతున్నారు. పది గంటల సమయానికి హాజరు కావాల్సిన అన్ని శాఖల అధికారులు పదకొండు గంటల సమయానికి కేవలం నాలుగు శాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు. ఐసీడీఎస్, వెలుగు, వ్యవసాయ శాఖ, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ మాత్రమే హాజరయ్యారు. విద్యాశాఖకు సంబంధించి ఇద్దరు ఎంఈవోలు ఉన్నప్పటికీ సీఆర్పీని ఈ కార్యక్రమానికి పంపించారు. పదకొండు గంటలు దాటిన తరువాత అప్పుడు ఎంపీడీవోతో పాటు ఇతర శాఖలకు చెందిన అధికారులు తాపీగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరయ్యారు.

ఇద్దరు వాహన దొంగల అరెస్టు

- టాటా ఏస్, 8 బైకులు స్వాధీనం



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న రూరల్ సీఐ శ్రీనివాసరావు

మంగళగిరి సిటీ, మే 26 (ఆంధ్రజ్యోతి): పార్కింగ్ చేసి ఉంచిన వాహనాలను దొంగి లించడమే లక్ష్యంగా పెట్టుకుని పలు చోరీ లకు పాల్పడిన ఇద్దరు నిందితులను మంగళ గిరి రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. మంగళగిరి సర్కిల్ కార్యాలయంలో సీఐ వై శ్రీనివాసరావు సోమవారం నిందితుల వివరాలను వెల్లడించారు. కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నం జూపూడి గ్రామానికి చెందిన కన్నా గోపి, ఎస్‌కే సర్దార్‌లు ముఠాగా ఏర్పడి వాహనాల చోరీకి పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 17వ తేదీన మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామ కూడలిలో పార్కింగ్ చేసిన టాటా ఏస్ వాహనం చోరీకి గురైందని బాధితుడు రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు బాపట్ల, స్టువర్టుపురం, చీరాల, కేసరి, చిల్లకల్లు ప్రాంతాల్లో నిందితుల కోసం గాలింపు చేపట్టారు. సీసీ కెమెరాల ఆధారంగా బాపట్లలో ఓ వైన్‌షాపు వద్ద నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.14 లక్షల విలువ చేసే టాటా ఏస్, 8 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సమావేశంలో రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్, ఏఎస్ఐ రత్నరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

బైట్ ఎక్సెల్ శిక్షణ విద్యార్థులకు దిక్సూచి

- మలినేని పెరుమాళ్లు



సమావేశంలో మాట్లాడుతున్న కళాశాల చైర్మన్ మలినేని పెరుమాళ్లు

వట్టిచెరుకూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సంస్థగా రూపొందిన బైట్ ఎక్సెల్ ఐదు సంవత్సరాలుగా ఇస్తున్న శిక్షణ విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తుందని మలినేని విద్యాసంస్థల చైర్మన్ మలినేని పెరుమాళ్లు అన్నారు. మండలంలోని పుల్లడిగుంట సమీపంలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ప్రముఖ ఐటీ శిక్షణ సంస్థ బైట్ ఎక్సెల్ ఐదు సంవత్సరాలుగా కొనసాగుతున్న భాగస్వామ్యాన్ని పురస్కరించుకొని సోమవారం కళాశాలలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో పెరుమాళ్లు ప్రసంగించారు. బైట్ ఎక్సెల్ సంస్థతో కలసి పని చేయటం వల్ల విద్యార్థులకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా సాంకేతిక నైపుణ్యాభివృద్ధి, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, ఇంటర్వ్యూలకు అవసరమైన ప్రిపరేషన్‌లో కార్పొరేట్ స్థాయి శిక్షణ లభిస్తుందని ఆయన కొనియాడారు. ఈ సంస్థ ఇచ్చే శిక్షణ ద్వారా ఐదు సంవత్సరాలుగా ప్లేస్‌మెంట్ శాతం పెరిగిందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు తమ అనుభవాలను వివరిస్తూ బైక్ ఎక్సెల్ శిక్షణ వల్ల తాము విశ్వాసంతో పాటు టెక్నాలజీపై పట్టుదల, ఇంటర్వ్యూలకు సిద్ధత, ప్రాక్టికల్ నాలెడ్జి ని సంపాదించగలిగామని చెప్పారు. ప్రముఖ సంస్థలో నిర్వహించే జాబ్‌మేళాలో శిక్షణ ద్వారా తమ విద్యార్థులు ఉద్యోగాలు సాధిస్తున్నారని యాజమాన్యం వెల్లడించింది. కార్యక్రమానికి బైక్ ఎక్సెల్ సంస్థ చీఫ్ సేల్స్ ఆఫీసర్ చరణ్ తాడేపల్లి ముఖ్యఅతిథిగా హాజరు కాగా.. కళాశాల ప్రిన్సిపాల్ జే అప్పారావు, డైరెక్టర్ దేవిరెడ్డి శ్రీనివాసకుమార్, ప్రొఫెసర్ జంపని కిషోర్‌బాబు, ట్రైనింగ్ అండ్ ప్లేస్ మెంట్ డైరెక్టర్ శ్వేత, విభాగాధిపతులతో పాటు అధ్యాపకులు, బైట్ ఎక్సెల్ బృందం పాల్గొన్నారు.

దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతున్న కేంద్రం

- సీపీఐ నేత జంగాల



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నేత జంగాల అజయ్‌కుమార్

మంగళగిరి సిటీ, మే 26 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను పెట్టుబడీదార్లకు, కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ ఆరోపించారు. మంగళగిరి సీపీఐ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఏరియా కమిటీ సమావేశం కంచర్ల కాశయ్య అధ్యక్షతన జరిగింది. అజయ్‌కుమార్ మాట్లాడుతూ నరేంద్ర మోదీ అధికారం చేపట్టాక దేశంలో ప్రజా వ్యతిరేక, నిరంకుశ విధానాలు ఎక్కువయ్యాయని మండిపడ్డారు. సామాన్య, మధ్య తరగతి ప్రజలు బతుకు సాగించలేని విధంగా నిత్యావసర ధరలను పెంచేసి, పన్నుల భారం మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు దాసోహమైందని విమర్శించారు. సీపీఐ మంగళగిరి పట్టణ మహాసభ జూలై 6న, మండల మహాసభలో 12న, తాడేపల్లి ప్రాంత సమావేశం 20న, మంగళగిరి నియోజకవర్గ మహాసభ 27వ తేదీన జరుగుతాయని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్ రావు, నేతలు యార్లగడ్డ వెంకటేశ్వరరావు, జాలాది జాన్‌బాబు, ముసునూరి సుహాస్, చిన్ని సత్యనారాయణ, నందం బ్రహ్మేశ్వరరావు, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై హింసను అరికట్టాలి

- పేదరిక నిర్మూలన సంస్థ, సీఆర్డీఏ సోషల్ వెల్‌ఫేర్ అధికారులు



ప్రతిజ్ఞ చేస్తున్న వెలుగు సిబ్బంది యాక్షన్ కమిటీ సభ్యులు

తుళ్లూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): మహిళలపై హింసను అరికట్టాలని పేదరిక నిర్మూలన సంస్థ, సీఆర్డీఏ సోషల్ వెల్‌ఫేర్ అధికారులు తెలిపారు. మహిళలు ఆర్థిక ఎదుగుద ల, వారి జీవనోపాధి గురించి, సమాజంలో లింగ వివక్ష, హింసను పూర్తిగా అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాల గురించి నాలుగు రోజుల శిక్షణ తరగతులను సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రారంభించారు. తొలిరోజు పది గ్రామ సమాఖ్య సంఘాల సభ్యులు, సోషల్ యాక్షన్ కమిటీలకు తరగతులు నిర్వహించారు. మహిళలపై అఘాయిత్యాలను అరికడతామని ప్రతిజ్ఞ చేశారు. రాజధాని ప్రాంతంలో బయట నుంచి వచ్చి జీవనోపాధి పొందే వారి సంఖ్య పెరిగిన నేపథ్యంలో వారి భద్రతపై దృష్టి ఉంచాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో సీఆర్డీఏ డీడీ బొర్రా శ్రీనివాసరావు, సెర్ప్ 9 (పేదరిక నిర్మూల సంస్థ) ప్రాజెక్టు మేనేజర్ వీరశేఖర్, ఎస్ఆర్ఎల్ఎం సభ్యులు శశికళ, లైవ్‌లీవుడ్ డీపీఎం రాం బాబు, కోఆర్డినేటర్ ఆదిలక్ష్మి, వెలుగు సీసీలు, యాక్షన్ కమిటీ సభ్యులు, వీవోఏలు పాల్గొన్నారు.

భవిత కేంద్రాలతో ప్రత్యేక విద్య : ఎంఈవో కెన్నడీ

కాకుమాను, మే 26(ఆంధ్రజ్యోతి): భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు ప్రత్యేక విద్యను అందిస్తున్నట్లు ఎంఈవో కెన్నడీ అన్నారు. మండల కేందరమైన కాకుమానులో సోమవారం ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల సర్వే నిర్వహించారు. చిన్నారుల ఇళ్లకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈవో కెన్నడీ మాట్లాడుతూ భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ప్రత్యేక విద్యను అందిస్తున్నట్లు వెల్లడించారు. చిన్నారులకు ఉపకరణాలు, అలవెన్స్‌లు, తదితర సదుపాయాలు కూడా ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. జూన్ 6 వరకు గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ ద్వారా ఇంటింటికి వెళ్లి ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు గుర్తించి వారిని కేంద్రాల్లో చేర్పించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు.

మహానాడుకు పసుపు సైన్యం సిద్ధం

తుళ్లూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ప్రతి ఏడాది ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకొని మహానాడు పండుగను నిర్వహించటం తెలిసిందే. ఈ ఏడాది మహానాడు పండుగను కడపలో న్విహిస్తున్నారు. మంగళ, బుధ, గురువారాలు మూడు రోజులు నిర్వహిస్తున్నారు. అందుకు ప్రతీ కార్యకర్త పసుపు పండుగకు తరలి రావాలంటూ నియోజకవర్గ టీడీపీ ఆర్టీఎస్ కోఆర్డీనేటర్ నెలకుదిటి చందు ఆధ్వర్యంలో సమాయత్త ర్యాలీ నిర్వహించారు. ఐన చెరువు కాలనీ నుంచి లైబ్రరీ సెంటర్ వరకు బైకులు, కార్లతో మహానాడు సమాయత్తం ర్యాలీ నిర్వహించారు. లైబ్రరీ సెంటర్లో టీడీపీ నాయకులు ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బండ్ల పట్టాభిరామయ్య, జమ్ముల అనిల్, గడ్డ వెంకటేశ్వరరావు, బాలయ్య బాబు యువసేన సభ్యులు పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వరస్వామి వార్షిక వేడుకలు

పెదనందిపాడు, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని అన్నపర్రులో గంగా అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి 22వ వార్షిక వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. స్వామికి అర్చకులు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామస్థులు, దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమాలను కమిటీ నిర్వాహకులు పర్యవేక్షించారు.

సమగ్ర కులగణనతో అన్ని వర్గాలకు న్యాయం

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన

మంగళగిరి, మే 26 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కులగణన జరిగితే అన్ని సామాజిక వర్గాలకు న్యాయం జరుగుతుందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన మంగళగిరిలోని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయం ద్వారా ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వాలు జనరంజక పాలన అందించాలంటే సమగ్ర కులగణన ఎంతో కీలకమన్నారు. దేశ ప్రజలందరినీ వారి కులాలతో సహా లెక్కించడం ద్వారా ఆయా కులాల జనాభా ఎంతెంత ఉంది, వారిలో సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉద్యోగ రంగాల్లో ఎంత మేరకు వెనుకబడి ఉన్నారో తెలుసుకునే వీలు కలుగుతుందన్నారు. అప్పుడే వికసిత భారత్‌తోపాటు ఏపీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న విజన్ స్వర్ణాంధ్ర సాధ్యమవుతుందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో జరిగిన సమావేశంలో సమగ్ర కుల గణనపై చర్చించడంపై శంకరరావు హర్షం వ్యక్తం చేశారు.

పెనుమాకలో 'పల్లె నిద్ర'



గ్రామస్థులతో మాట్లాడుతున్న డీఎస్పీ మురళీకృష్ణ, సీఐ కళ్యాణ్‌రాజు

తాడేపల్లి (పెనుమాక), మే 26 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలోని పెనుమాకలో సమస్యల పరిష్కారం కోసం 'పల్లె నిద్ర'కు శ్రీకారం చుట్టారు. ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు నార్త్ సబ్ డివిజన్ డీఎస్పీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో తాడేపల్లి పోలీసు స్టేషన్ పరిధిలోని పెనుమాక గ్రామంలో ఆదివారం రాత్రి ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లోని సమస్యలను నేరుగా ప్రజల నుండే తెలుసుకోవడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యమన్నారు. ఈ సందర్భంగా పలువురు స్థానికులు డీఎస్పీతో మాట్లాడుతూ గ్రామంలో సాయంత్రం సమయంలో స్కూలు వదిలేటప్పుడు పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ కళ్యాణ్‌రాజు, ఎస్ఐ ఖాజావలి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, గ్రామ అధ్యక్షుడు పాలెపు వీరేంద్రనాథ్, గ్రామ మాజీ ఉప సర్పంచ్ పఠాన్ జానీఖాన్, స్థానికులు పాల్గొన్నారు.

జబ్బును నయం చేయడంలో నర్సులదే ముఖ్యపాత్ర



దుగ్గిరాల పీహెచ్‌సీ సిబ్బందిని సత్కరిస్తున్న ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రామస్వామి, గ్రామపెద్దలు

దుగ్గిరాల, మే 26 (ఆంధ్రజ్యోతి): రోగికి జబ్బు నయం చేయడంలో నర్సులదే ముఖ్యపాత్రని ఫ్రెండ్స్‌వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు తాడిబోయిన రామస్వామి అన్నారు. దుగ్గిరాలలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యులు, నర్సులు, సిబ్బందిని సోమవారం ఘనంగా సత్కరించారు. మాజీ ఎంపీపీ వెనిగళ్ల శ్రీకృష్ణప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రామస్వామి మాట్లాడుతూ, కరోనా సమయంలో తమప్రాణాలకు తెగించి ఇండ్లకు వెళ్లి వారికి మందులను అందించిన నర్సుల రుణం తీర్చుకోలేనిదన్నారు. డాక్టర్ ఇజాజ్ అబ్దుల్‌రహ్మాన్, డాక్టర్ ఇందిర, పలువురు నర్సులు, పీహెచ్‌సీ సిబ్బందిని ఘనంగా సత్కరించారు. దోస్త్ అధ్యక్షుడు మిక్కిలినేని గాంధీ, షేక్ సుభాని, చుండూరు ఉమా మహేశ్వరరావు, కొంగర జోగేంద్రప్రసాద్, కొండపనేని రవీంద్ర, జెట్టి బాలరాజు, విశ్రాంత ఎస్ఐ రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

పంటకాల్వలు.. తూముల మరమ్మతులు చేపట్టాలి



తహసీల్దార్ సునీతకు వినతిపత్రం అందిస్తున్న రైతు, కౌలురైతుసంఘాల నాయకులు

దుగ్గిరాల, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాల్లో పూడిక తీయని పంటకాల్వలు, తూములకు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ కౌలురైతు సంఘాల, రైతుసంఘాల నాయకులు తహసీల్దార్ సునీతకు వినతిపత్రం సోమవారం అందించారు. తుమ్మపూడివద్ద హెడ్‌స్లూయిస్ పనులు త్వరగా చేపట్టి ఖరీఫ్ నాటికి సాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలని వినతిపత్రం అందించారు. బకింగ్‌హామ్‌కాల్వ నుంచి పంట కాల్వలకు నీటిని పంపేందుకుగల తూముల్లో తుప్పపట్టి, దెబ్బతిన్న వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని, తూటికాడకు మందు చల్లించాలని, కాల్వలో నీటిప్రవాహానికి ఆటంకంగా వున్న, గుర్రపుడెక్కను తొలగించాలని కోరుతూ వినతిపత్రం అందించిన వారిలో రైతుసంఘాల, కౌలురైతుసంఘాల నాయకులు, జెట్టి బాలరాజు, భీమవరపు అమ్మిరెడ్డి, హరీష్, వెంకట్రావు తదితరులున్నారు.

చలపతి ఫార్మసీలో మెగా జాబ్‌మేళా



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ రామారావు, కంపెనీల ప్రతినిధులు

తాడికొండ(లాం), మే 26(ఆంధ్రజ్యోతి): లాం చలపతి ఫార్మసీ కళాశాలలో వివిధ ఫార్మ కంపెనీలు జాబ్ మేళాను సోమవారం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు పేర్కొన్నారు. జాబ్ మేళాలో ప్రముఖ ఫార్మా కంపెనీలైన నాట్కో, హెటిరో, అరబిందో కంపెనీలు పాల్గొన్నట్లు తెలిపారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి 300 మంది విద్యార్థులు జాబ్ మేళాలో పాల్గొన్నారు. విద్యార్థులందరికీ ముందుగా రాత పరీక్ష నిర్వహించారు. రాత పరీక్షలు ఉత్తీర్ణులైన వారికి టెక్నికల్, హెచ్‌ఆర్ రౌండ్‌ను నిర్వహించారు. హెచ్‌ఆర్ రౌండ్‌లో ఉత్తీర్ణులైన వారు ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. నాట్కో ఫార్మా కంపెనీలో 15 మంది, హెటిరో ఫార్మా కంపెనీకు 30 మంది, అరబిందో ఫార్మా కంపెనీలో 20 మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలియజేశారు. విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించిన వారిలో నాట్కో ఫార్మా డిప్యూటీ జనరల్ మేనేజర్ కే గోపికృష్ణ, హెటిరో ఫార్మా హెచ్‌ఆర్ మేనేజర్ కే సమీర్‌కుమార్, అరబిందో కంపెనీ హెచ్ ఆర్ మేనేజర్ ఎండీ ఫైసల్, సీనియర్ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ కే త్రివిక్రమ్‌లు ఎంపిక ప్రక్రియలు నిర్వహించారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను చలపతి విద్యాసంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు అభినందించారు.

గుండిమెడలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న చిగురుపాటి సుబ్బారావు

తాడేపల్లి (గుండిమెడ), మే 26 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలోని గుండిమెడలో సోమవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కును లబ్ధిదారుకు టీడీపీ గ్రామ అధ్యక్షుడు చిగురుపాటి సుబ్బారావు అందజేశారు. గ్రామానికి చెందిన నామతోటి స్వర్ణలత ఇటీవల అనారోగ్యానికి గురై అనంతరం హాస్పిటల్ నుంచి డిశ్చార్జి అయిన తరువాత సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా మంత్రి నారా లోకేశ్ రూ.44600లు చెక్కును మంజూరు చేయించారు. సదరు చెక్కును సుబ్బారావు లబ్ధిదారు భర్తకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రధాన కార్యదర్శి నామతోటి రాంబాబు, కాసరనేని అంకినీడు, అనుమోలు సాంబశివరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు. లబ్ధిదారు మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నల్లబర్లీ పొగాకును తక్షణమే కొనుగోలు చేయాలి

- సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పాశం రామారావు



సమావేశంలో మాట్లాడుతున్న పాశం రామారావు


పెదనందిపాడు, మే 26 (ఆంధ్రజ్యోతి): నల్లబర్లీ పొగాకును ప్రభుత్వం తక్షణమే కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పాశం రామారావు అన్నారు. స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో సీపీఎం విస్తృత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడేళ్లుగా దిగుబడులు, ధరలు ఆశాజనకంగా ఉండటంతో రైతులు పొగాకు వైపు మొగ్గు చూపారని ఈ ఏడాది మద్దతు ధర లేకపోవడంతో అన్నదాతలు కష్టాలు, నష్టాలతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గుంటూరు చానల్‌ను త్వరగా నిధులు కేటాయింపులు చేసి పనులు పూర్తి చేసి తాగు, సాగు నీటి కష్టాలను తొలగించాలని, నల్లమడ వాగు ఆధునికీకరణ పనులు వెంటనే చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో దొప్పపూడి రమేష్‌బాబు, రామారావు, వెంకటేశ్వర్లు, వెంకట సుబ్బారావు, రాజేంద్ర, ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

నిరసన దీక్షకు రైతులు తరలిరావాలి

- నల్లమడ రైతు సంఘ జిల్లా నాయకుడు కొల్లా రాజమోహన్‌రావు

నల్లబర్లీ పొగాకు వెంటనే కొనుగోలు చేయాలని కోరుతూ రైతుల నిరసన దీక్షలకు పెద్ద సంఖ్యలో రైతులు తరలిరావాలని నల్లమడ రైతు సంఘ జిల్లా నాయకుడు కొల్లా రాజమోహన్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిలకలూరిపేటలోని ఐటీసీ పొగాకు కంపెనీకి ఎదురుగా మంగళవారం జరిగే నిరసన కార్యక్రమంలో రైతులు పాల్గొని విజయవంతం చేయాలని, ప్రభుత్వ పెద్దలు, మంత్రుల సమక్షంలో కంపెనీలు అంగీకరించి కొనుగోలు చేయడంలేదని వెంటనే కొనుగోలు చేసే విధంగా ఒత్తిడి తీసుకువచ్చేందుకు దీక్షలు చేపడుతున్నట్లు పొగాకు బోర్డులోకి బర్లీ పొగాకును కూడా తీసుకురావాలని కోరారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమ్మె విరమణ



మీడియాతో మాట్లాడుతున్న ఏపీఎంసీఏ కృష్ణా జిల్లా అధ్యక్షుడు నిరంజన్

మంగళగిరి, మే 26 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ, ఈపీఎఫ్‌వో పునరుద్ధరణ, ఎఫ్‌ఆర్ఎస్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు గత నెల 15వ తేదీ నుంచి చేస్తున్న సమ్మెను సోమవారం విరమించి విధుల్లో చేరినట్టు ఏపీఎంసీఏ కృష్ణా జిల్లా అధ్యక్షుడు ఎన్.నిరంజన్ తెలిపారు. మంగళగిరి ఆటోనగర్‌లోని ఏపీఐఐసీ కార్యాలయం వద్ద సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఏపీ ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో జరిగిన చర్చలు సఫలం కావడంతో సమ్మె విరమించామన్నారు. ప్రస్తుతం తమకు రావలసిన 8 నెలల జీత బకాయిలలో 6 నెలల జీతాలను చెల్లిస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని కోరారు. 27 రోజుల సమ్మెలో రాష్ట్ర వ్యాప్తంగా 10,032 మంది సభ్యులు పాల్గొన్నారని చెప్పారు. తమ పోరాటానికి సహకరించిన ఉద్యోగ సంఘాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఏపీఎంసీఏ కార్యదర్శి సందీప్, కోఆర్డినేటర్ వినోద్ నాయక్, గుంటూరు జిల్లా కార్యదర్శి లింగరాజు, పల్నాడు జిల్లా అధ్యక్షురాలు అనుపమ, వర్షిణి, నీలిమ, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

బైక్‌ల దొంగతనం కేసులో ఇద్దరికి ఆరు నెలలు జైలు

కొల్లిపర, మే 26 (ఆంధ్రజ్యోతి): బైక్‌లు దొంగతనం కేసులో ఆరు నెలలు జైలు శిక్ష విధిస్తూ సోమవారం తెనాలి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి రాజశేఖర్ తీర్పు వెలువరించారు. ఎస్‌ఐ కోటేశ్వరావు తెలిపిన వివరాలు ప్రకారం కొల్లిపర మండలం కుంచవరం గ్రామానికి చెందిన వెలివెల కోటేశ్వరరావు హీరో హోండా మోటార్ సైకిల్‌ను, కొల్లిపరకు చెందిన కేశన గంగాధర్ మోపెడ్‌ను డిసెంబరు 29వ తేదీ 2024వ సంవత్సరంలో ఇంటి ముందు పెట్టుకున్నారు. ఉదయం చూడగా కనిపించకపోవడంతో కొల్లిపర పోలీసుస్టేషన్ ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో కొల్లిపరకు చెందిన అమిరే ఆనంద్‌కిషోర్, పిల్లి శ్రీనులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా ముద్దాయిలకు ఆరు నెలలు జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ కేసుకు పీపీగా సునీల్‌కుమార్ వ్యవహరించారు.

బ్యాంక్ ఖాతాలకు ఆధార్ సీడింగ్ తప్పనిసరి

● పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

తెనాలి, మారీసుపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): పోస్టల్ బ్యాంక్ ఖాతాలకు ఆధార్ సీడింగ్ తప్పనిసరి అని తెనాలి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు అన్నారు. తెనాలి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంక్షేమ పథకాల నగదు బదలీ కోసం ఆధార్ బ్యాంక్ అకౌంట్‌కి తప్పనిసరి అన్నారు. అందుకు అనుగుణంగా పోస్టల్ డిపార్ట్‌మెంట్ ఆధార్ సీడింగ్ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ప్రభుత్వం చేపట్టిన తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి పథకాల నగదు నేరుగా బ్యాంకు ఖాతాకు జమ చేసేందుకు ఎన్‌పీసీఐ మ్యాపర్‌లో ఆధార్‌కు బ్యాంకు అకౌంట్‌కు మ్యాపింగ్ చేయాల్సి ఉంటుందన్నారు. వచ్చే నెల 5 తేదీ లోపు అందరూ ఆధార్ సీడింగ్‌తో పాటు ఎన్‌పీసీఐ లింకేజ్ చేస్తూ ఖాతాలను ఓపెన్ చేయిడం ద్వారా సంక్షేమ పథకాలు పొందవచ్చన్నారు. ఆధార్ సీడింగ్ కాని వారు వెంటనే తమ దగ్గలోని పోస్ట్ ఆఫీస్‌ను సంప్రదించాలని తెనాలి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు పురపాలక సంఘ అత్యవసర సమావేశం

తెనాలి, మారీసుపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): నేడు మంగళవారం పురపాలక సంఘం అత్యవసర సమావేశాన్ని నిర్వహించనున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక తెలిపారు. పురపాలక సంఘ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ఉదయం గం.11.30ని.లకు అత్యవసర సమావేశాన్ని నిర్వహిస్తామని మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, ఎక్స్ అఫీషియో మెంబర్లు, కో ఆప్షన్ సభ్యులు వివిధ శాఖల అధికారులు పాల్గొంటారని చైర్‌పర్సన్ రాధిక సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

తెనాలి అర్బన్, మే 26 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో సోమవారం మజ్జిగ పంపిణీ చేశారు. సీనియర్ రోటరీ క్లబ్ సభ్యుడు కన్నెగంటి మురళీకృష్ణ మాట్లాడుతూ, సమాజంలో ప్రతి ఒక్కరూ తమకు ఉన్నంతలో సేవలు అందించాలన్నారు. ఆలపాటి కిరణ్ సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీధర్, ఆంజనేయులు, రాంబాబు, వరప్రతాప్, కె.శ్రీనివాసరావు, అర్జునరావు, శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కఠెవరంలో కుక్కల బెడదపై వినతి

తెనాలి అర్బన్, మే 26 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం కఠెవరంలో కుక్కల బెడదపై సోమవారం గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేశారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 8 దరఖాస్తులు అందాయి. రెవెన్యూ 3, పోలీసు 4, పంచాయతీరాజ్ 1 చొప్పున వినతి పత్రాలు అందినట్లు చెప్పారు. కఠెవరంలో కుక్కల బెడద అధికంగా ఉందని, వృద్ధులు, వికలాంగులు, పిల్లలు బయటకు రావాలంటే భయపడుతున్నారని తగిన చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ నగర్ ప్రాంత వాసులు కోరారు.

31న కవితా పుస్తకాల ఆవిష్కరణ

తెనాలి అర్బన్, మే 26 (ఆంధ్రజ్యోతి): తెనాలికి చెందిన రచయిత నూతలపాటి నాగేశ్వరరావు రచించిన కవితా పుస్తకాలను ఈ నెల 31న హైదరాబాద్‌లో ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. కథల పరిమళాలు, కవితా కెరటాలు అనే రెండు సంకలనాలను ఆయన రచించారు. ఈ సంకలనాలలో 100 మంది కవులు, రచయితలు, రాసిన కథలు, కవితలు ముద్రించారు. తెలుగు విశ్వ విద్యాలయంలోని ఎన్టీఆర్ ఆడిటోరియంలో ఇంటర్నేషనల్ ఇంక్ బౌండ్ పేరిట నిర్వహించే సాహితోత్సవంలో వీటిని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు.

మహిళకు అంజుమన్ కమిటీ ఆర్థిక సాయం

పొన్నూరు టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): పేదల కోసం పొన్నూరు అంజుమన్ కమిటీ అనేక సేవా కార్యక్రమాలు చేస్తోంది. పట్టణంలోని 29వ వార్డుకు చెందిన టీడీపీ మైనార్టీ నాయకుడు రావూఫా కొంతకాలం క్రితం మృతి చెందాడు. ఆమె భార్య అనారోగ్య సమస్యలతో ఇబ్బందిపడుతోంది. విషయం తెలుసుకున్న అంజుమన్ కమిటీ ప్రెసిడెంట్ మగ్బుల్‌బేగ్ కమిటీ సభ్యులతో కలిసి సోమవారం పరామర్శించి సొంత నిధుల నుంచి రూ.5000 ఆర్థికసాయం అందించారు. కుటుంబానికి అండగా నిలుస్తామని ధైర్యం చెప్పారు. పలువురు కమిటీ సభ్యులు, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

సన్నద్ధమేనా..!?

● కరోనాపై హెచ్చరికలున్నా ఆసుపత్రిలో ఏర్పాట్లు నిల్
● అనుమానితులకు పరీక్షలు జరిపేలా అందుబాటులో లేని కిట్లు
● ప్రత్యేక వార్డుల కేటాయింపుపై సందిగ్ధత
● ఐసోలేషన్, ఐసీయూల ఏర్పాటుపై చర్యలు శూన్యం


జిల్లా ప్రభుత్వవైద్యశాలలో ఆధునికీకరణ పనులు పూర్తి చేసుకుంటున్న వార్డు

తెనాలి రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరోనా మహమ్మారిపై హెచ్చరికలు జారీ చేస్తున్న నేపథ్యంలో తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలపై అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టిపెట్టాల్సి ఉంది. విపత్తు ముంచుకురాకముందే తగిన జాగ్రత్తలు పాటిస్తే కేసులను ఆదిలోనే కట్టడిచేసే అవకాశం ఉంటుందని పలువురు విశ్లేషకులు అభిప్రాయ వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వైద్యశాలలో రూ.కోటితో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. అందులో భాగంగా వార్డుల మరమ్మతులు 90శాతం పూర్తిచేశారు. ఆయా వార్డుల్లో ఆక్సిజన్ అందించేలా అన్ని సౌకర్యాలు ఉన్నాయి. బెడ్లు, ఇతర సౌకర్యాలు కల్పిస్తే ఒక్కో వార్డులో దాదాపుగా 20-25 మంది వరకూ వైద్యసేవలందించవచ్చు. సాధారణ రోగులతో కలిసే పనిలేకుండా ఆసుపత్రి పడమర ద్వారం ద్వారా లోపలికి వెళ్లి వైద్యసేవలు పొందే అవకాశం ఉంది. తూర్పు భాగంలో సాధారణ రోగులకు వైద్యసేవలందించవచ్చు. వైద్యశాఖాధికారులు తొలిలోనే అప్రమత్తమైతే బాధితుల సంఖ్యను పూర్తిస్థాయిలో తగ్గించే అవకాశం ఉంటుంది.



జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో గతంలో సేవలందించి ఐసోలేషన్ వార్డు

ప్రత్యేక వార్డుల కోసం ఆదేశాలు లేవు

ఆసుపత్రిలో కొవిడ్ బాధితులకు ప్రత్యేక వార్డులు కేటాయించమని ఉన్నతాధికారుల నుంచి ఎటువంటి ఆదేశాలు అందలేదని ఆసుపత్రి సూపరింటెండెంట్ సౌభాగ్యవాణి తెలిపారు. తాము మాత్రం ఎప్పటికప్పుడు అప్రమత్తంగానే ఉంటున్నామన్నారు. కొవిడ్ బాధితులకు అవసరమైన వార్డులు కేటాయింపునకు ప్రాథమికంగా అంచనా వేశామన్నారు. కరోనా పరీక్ష కిట్లు అందుబాటులో లేవని ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు. ఇప్పటి వరకూ ఒక్క కొవిడ్ పాజిటివ్ కేసు కూడా నమోదు కాలేదని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపట్టడం జరుగుతుందని సూపరింటెండెంట్ సౌభాగ్యవాణి స్పష్టం చేశారు.

ఉనికి చాటుతున్న మహమ్మారి

ఎంతో మందిని బలిగొన్న కరోనా మహమ్మారి అంతమైపోయిందనుకుంటున్న తరుణంలో తిరిగి తన ఉనికిని చాటుతుంది. గత కొద్దిరోజులుగా దేశంలో వివిధ ప్రాంతాల్లో కేసులు నమోదు కాగా తాజాగా రాష్ట్రంలో కూడా కరోనా మహమ్మారి వెలుగుచూడటంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ వ్యాధి సోకి ఏ ఒక్క ప్రాణం పోకూడదన్న ఉద్దేశంతో ముందస్తు చర్యలపై హెచ్చరికలు జారీ చేసింది. దీంతో ఇప్పటికే మాస్కులు, శానిటేషన్, సమూహాల్లో తిరగడం మానాలంటూ ప్రచారంపై అవగాహన పెంచుతోంది. జలుబు, జ్వరం, నొప్పులు, దగ్గు, గొంతునొప్పి, శ్వాస తీసుకోవడం కష్టతరమవడం వంటి లక్షణాలుంటే వైద్యశాలలను సంప్రదించి కొవిడ్ టెస్ట్ చేయించుకోవాలని సూచించింది.

రాష్ట్రంలో తొలిగా మే 2020లో కరోనా కేసులు వెలుగుచూశాయి. ఆయా సమయాల్లో గుంటూరు జిల్లాలోనే రెండో అతిపెద్ద వైద్యశాలగా పేరుగాంచిన తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలను ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా కొవిడ్ ఆసుపత్రిగా మార్పులు చేశారు. ఆ సమయంలో వేలాది మంది కరోనా సోకిన బాధితులకు ఇక్కడ వైద్యశాలల్లో వైద్యులు నిరంతరం పర్యవేక్షించి మరణాలను తగ్గించడంలో ఎంతగానో కృషిచేసి పలువురు మన్ననలు పొందారు. కొవిడ్ తగ్గుముఖం పట్టడంతో వైద్యశాలను సాధారణ వైద్యశాలగా మార్పులు చేసి వైద్యం అందిస్తున్నారు. ప్రస్తుతం కొవిడ్ కేసులు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో వెలుగుచూస్తున్న నేపథ్యంలో వైద్యశాలల్లో తిరిగి వ్యాధి నిర్ధారణకు ఏర్పాట్లు చేయాల్సి ఉంది. ఆక్సిజన్ ఉత్పత్తి అందుబాటులో ఉండగా టెస్టింగ్ కిట్లు, పీపీఈ కిట్లు, మాస్కులు, ఐసోలేషన్ వార్డు, కొవిడ్ బాధితులకు ప్రత్యేక వార్డులు, ప్రత్యేక ఓపీ వంటివి ఏర్పాటుకు సన్నద్ధం చేయాల్సి ఉంది. మండుటెండలు కాయాల్సిన ఈ సమయంలో ఉదయం ఎండలు సాయంత్రం గాలులతో కూడిన వర్షం కురుస్తుండటంతో సీజనల్ వ్యాధులైన జ్వరం, ఒళ్లు నొప్పులు, గొంతు నొప్పి, జలుబు వంటి అనారోగ్య సమస్యలతో పలువురు వైద్యశాలను సందర్శిస్తున్నారు. ఇటువంటి సమయంలో కొవిడ్ కేసులను గుర్తించడం కష్టతరంగా మారవచ్చు. రెండింటి లక్షణాలు ఒకటే కావడం ఇందుకు ప్రధాన సమస్యగా మారుతోంది. ప్రస్తుతం తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల్లో సీజనల్ వ్యాధుల బారిన పడి వైద్యసేవలకు వచ్చేవారు అధికంగా ఉంటున్నారు. సాధారణ పరీక్షలు జరిపి అవసరమైన వారికి మందులు అందించి పంపుతున్నారు. అనుమానితులకు పరీక్షలు జరిపేందుకు ల్యాబ్‌లలో సైతం కొవిడ్ పరీక్ష కిట్లుగా చెప్పే రాపిడ్ యాంటిజెన్ పరీక్ష, ఆర్టీ పీసీఆర్ పరీక్షలు అందుబాటులో లేవు. తాత్కాలికంగా పరీక్షలు జరిపేలా గతంలో రాపిడ్ యాంటిజెన్ కిట్లు ఈ ఆసుపత్రిలో అందుబాటులో ఉంచారు. దీంతో అనుమానితులకు పరీక్షలు జరిపేవారు. దీనిద్వారా సుమారు 20-30 నిమిషాల వ్యవధిలో కొవిడ్ లేదా ఇతర అనారోగ్య సమస్యలా అనే విషయాలను తాత్కాలికంగా నిర్ధారించేవారు. పాజిటివ్ వస్తే వారిని ఐసోలేషన్‌లో ఉంచి ఆర్టీ పీసీఆర్ టెస్ట్‌కు శాంపిల్స్ కలెక్ట్‌చేసి దాని రిపోర్ట్‌లో కూడా పాజిటివ్ వస్తే కొవిడ్‌గా నిర్ధారించి చికిత్స అందించేవారు.

పశుపోషకులకు అండగా ప్రభుత్వం నిలుస్తుంది

● 50శాతం సబ్సిడీతో పశు సమీకృత దాణా
● పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ నాగిరెడ్డి

తెనాలి రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): పశుపోషకులను ప్రోత్సహించేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టింది. పశువులను పోషించేందుకు వాడే ఎండుగడ్డి, దాణా వంటివాటి ధరలు ఆకాశాన్నంటడంతో పశువుల పెంపకంపై పాడి రైతులు నానాటికి తగ్గుముఖం పడుతున్నారు. దీనిపై ఈ నెల 20న ఆంధ్రజ్యోతి హార్వెస్టర్ కోత.. పుశుపోషణకు వాత అనే కథనం ద్వారా సవివరంగా ప్రచురించింది. దీనిపై ప్రభుత్వం స్పందించింది. పశుపోషకులపై ఆర్థిక భారం పడకుండా 50శాతం సబ్సిడీతో సమీకృతదాణా వంటి వాటిని పాడిరైతులకు అందిస్తోంది. 50కేజీల బస్తా ధర బహిరంగ మార్కెట్లో రూ.1110 ఉండగా ప్రభుత్వం సబ్సిడీతో రూ.555కే అందిస్తోంది. అంతేకాకుండా పశువుల ఆరోగ్య పరిరక్షణకు సైతం గ్రామంలోనే వైద్యశాల ద్వారా పూర్తి ఉచితంగా నాణ్యమైన వైద్యసేవలందించేలా ఆదేశాలు జారీ చేసింది.


బుర్రిపాలెం వెటర్నరీ వైద్యశాలలో సబ్సిడీపై దాణా అందిస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ నాగిరెడ్డి

రాబోయే రోజుల్లో పాడి పరిశ్రమకు పూర్వవైభవం రానుందని బుర్రిపాలెం పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ నాగిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక రైతులకు సబ్సిడీపై సమీకృత దాణాను పంపిణీ చేశారు. మండలంలోని అంగలకుదురు, గుడివాడ, కొలకలూరు, పెదరావూరు, బుర్రిపాలెం రోడ్డు పశువుల వైద్యశాల్లో సోమవారం నుండి సబ్సిడీపై సమీకృత దాణా పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఆయా గ్రామాల్లో వెటర్నరీ వైద్యులు గ్రామ పెద్దల ద్వారా పశుపోషకులకు సబ్సిడీపై దాణా అందించారు. మండలంలోని అంగలకుదురులో గ్రామ సర్పంచ్ ఊసరపు రాజ్యలక్ష్మి, ఉపసర్పంచ్ కనగాల నాగభూషణం, గణేష్ యూత్ కన్వీనర్, టీడీపీ సీనియర్ నేత వీరవల్లి మురళి కలసి పశుపోషకులకు సమీకృత దాణా పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పశువైద్యురాలు డాక్టర్ అనూష పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో పలువురు గ్రామస్థులు, వెటర్నరీ వైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలతో జీవితం చిత్తవుతుంది

పల్లె నిద్రలో అర్బన్ సీఐ వీరానాయక్

పొన్నూరు టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): మద్యం, పేకాట వంటి చెడువ్యసనాలకు బానిసలైతే జీవితం చిత్తవుతుందని అటు సమాజంలో ఇటు కుటుంబంలో కూడా తగిన గౌరవం ఉండదని పొన్నూరు అర్బన్ సీఐ వీరానాయక్ హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని 3వ వార్డులో పల్లె నిద్ర కార్యక్రమం ద్వారా సైబర్ నేరాలు, పోక్సో, మహిళలు, బాలికల సంరక్షణ చట్టాలు, వాహన భద్రతా చట్టం వంటి వాటిపై వార్డు ప్రజలకు సీఐ వీరానాయక్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వీరానాయక్ మాట్లాడుతూ చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళలు, బాలికలకు ప్రత్యేక చట్టాలున్నాయని వారిని దూషించినా, వేధింపులకు గురిచేసినా కఠిన శిక్షలున్నాయన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలను విద్యాలయాలకు పంపే క్రమంలో ప్రతిరోజు వారి ప్రవర్తనను గమనించాలన్నారు. మైనర్లకు ఎట్టిపరిస్థితుల్లో వాహనాలు ఇవ్వకూడదన్నారు. ద్విచక్రవాహనాలు నడిపే వారు హెల్మెట్ ధరించాలని, కారు ఇతర వాహనాలు నడిపే వారు సీట్‌బెల్ట్ పెట్టుకోవాలన్నారు. వాహనదారులు తప్పనిసరిగా వాహన రికార్డులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వార్డుల్లో అనుమానితులు సంచరిస్తున్నా, అసాంఘీక కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం ఉన్నా స్థానిక పోలీసులకు తెలియజేయాలన్నారు. నేర నియంత్రణకు ప్రతి ఒక్కరూ పోలీసులతో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎస్‌ఐ శ్రీహరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కూటమి నాయకులు, వార్డు ప్రజలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పొన్నూరు అర్బన్ సీఐ వీరానాయక్

రేపటి నుంచి పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై స్పెషల్ సమ్మర్ క్యాంప్

పొన్నూరు టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 28 నుంచి జూన్ 6 వరకూ నిర్వహించే పర్సనాలిటీ డెవలప్‌మెంట్ అండ్ ప్రాక్టికల్ ట్రైనింగ్ ప్రోగ్రాం స్పెషల్ సమ్మర్ క్యాంపును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహక సభ్యులు ఓ సోమవారం ప్రకటనలో కోరారు. పట్టణంలోని లయన్స్ పాలీ సర్వీస్ అండ్ వెల్ఫేర్ సెంటర్‌లో జరిగే ట్రైనింగ్ క్లాసుల్లో రెండో తరగతి నుంచి ఇంటర్ విద్యార్థుల వరకూ హాజరుకావచ్చన్నారు. ఉదయం 7గంటల నుంచి 9గంటల వరకూ జరిగే క్యాంపులో డాన్స్ క్లాస్, జంక్‌ఫుడ్స్‌ని తీసుకోవడం వల్ల కలిగే అనారోగ్య సమస్యలపై వివరించడం, సెల్‌ఫోన్ మీడియోగేమ్స్ మాన్పించి చదువుపై ఆసక్తి పెంచడం, లైఫ్ స్కిల్స్‌పై ప్రత్యేక కౌన్సెలింగ్ వంటివి ప్రముఖ అబ్జర్వేషనల్ సైకాలజిస్ట్ పిన్నబోయిన శ్రీమన్నారాయణ పర్యవేక్షణలో జరుగుతాయన్నారు. ఆసక్తి కలిగిన వారు తమ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.



గ్రీవెన్స్‌లో పొన్నూరు తహసీల్దార్ జియావుల్‌హక్, అధికారులు

ప్రతి అర్జీ సత్వర పరిష్కారానికి కృషి చేస్తా

● తహసీల్దార్ జియావుల్ హక్

పొన్నూరు టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా మండలంలోని ప్రజలు తెలిపిన ప్రతి సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని తహసీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ చెప్పారు. సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో జియావుల్‌హక్ ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా వివిధ సమస్యలతో వచ్చిన వారి నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రీవెన్స్‌కు మొత్తం 8 అర్జీలు అందాయన్నారు. వాటిల్లో సివిల్ సప్లైకి-3, రెవెన్యూ-2, సర్వే-1, ఇరిగేషన్-1, డ్రైనేజ్ -1గా ఉన్నాయన్నారు. పలు శాఖల అధికారులు తదిరులు పాల్గొన్నారు.


క్యూ నిండి బయట నిలబడిన రోగి సహాయకులు, మందుల కోసం ఏర్పాటు చేసిన ఒకే కౌంటర్

ప్రభుత్వ వైద్యశాలలో మందుల కోసం అవస్థలు

తెనాలిరూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో మందుల కోసం రోగులు, వారి సహాయకులు అవస్థలు పడుతున్నారు. ఆసుపత్రికి వివిధ ప్రాంతాల నుంచి అనారోగ్య సమస్యలతో వచ్చిన వారికి వైద్యులు మందులు రాస్తుంటారు. వాటిని తీసుకునేందుకు సాధారణంగా స్త్రీ, పురుషులు, దివ్యాంగులు-వృద్ధులకు వేరువేరుగా కౌంటర్ల ద్వారా మందులు అందించాల్సి ఉంటుంది. అయితే స్త్రీ, పురుషులకు వేరుగా మందుల కౌంటర్లు ఉన్నప్పటికీ సిబ్బంది కొరత నెపంతో కేవంలో స్త్రీల కౌంటర్ ద్వారా మాత్రమే మందులు అందిస్తున్నారు. దీంతో ఒకే క్రమంలో మందుల కోసం స్త్రీలు, పురుషులు, వృద్ధులు, దివ్యాంగులు, చిన్నారుల తల్లిదండ్రులు ఇలా అందరూ ఒకే వరుసలో మందుల కోసం బారులు తీరి గంటలతరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి. ఆసుపత్రి అధికారులు మందుల కోసం వచ్చే రోగులు, వారి బంధువుల ఇబ్బందులను గుర్తించి వేరువేరు కౌంటర్లలో సత్వరమే మందులు అందేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

సచివాలయం సిబ్బంది నిబంధనలు పాటించాలి

● ఎంపీడీవో విజయలక్ష్మి

కొల్లిపర, మే 26 (ఆంధ్రజ్యోతి): సచివాలయంలో పనిచేస్తున్న సిబ్బంది ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. సోమవారం మండల పరిధిలోని వల్లభాపురం, మున్నంగి, కొల్లిపర తదితర సచివాలయాలను ఆమె తనిఖీ నిర్వహించారు. రికార్డులను పరిశీలించి సచివాలయం సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. సచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది ప్రజల నుంచి ఎటువంటి సమస్యలు రాకుండా చూసుకోవాలన్నారు. సచివాలయ సిబ్బంది సమయపాలనను తప్పనిసరిగా పాటించాలని లేకపోతే తగిన చర్యలు తీసుకోనున్నట్లు తెలియజేశారు. అదేవిధంగా పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.


కోతకు గురైన రోడ్డుపై వేసిన ముళ్లకంప

ప్రమాదకరంగా కొత్తరెడ్డిపాలెం రోడ్డు

పొన్నూరు టౌన్, (చేబ్రోలు) మే 26 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం పాత రెడ్డిపాలెం సచివాలయం వద్ద నారాకోడూరు నుంచి కొత్తరెడ్డిపాలెం వెళ్లే రోడ్డులో ఎర్ర చెరువుకు నీళ్లు వచ్చే తూము వద్ద గొయ్యి ఏర్పడింది. భారీ వాహనాలు రాకపోకలు పెరగడంతో రోడ్డు కోతకు గురైందని స్థానికులు వాపోతున్నారు. ఆ రోడ్డుపై వాహనాలు వెళ్లి ప్రమాదాల బారినపడకుండా ముళ్లకంప అడ్డుగావేసి ఉంచారు. సంబంధిత అధికారులు ఆ ప్రాంతాన్ని పరిశీలించి రోడ్డు ప్రయాణం సురక్షితంగా జరిగేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.


1108 లడ్డూలతో భక్తులు

పంచముఖ ఆంజనేయస్వామికి 1108 లడ్డూల పూజ

తెనాలి అర్బన్, మే 26 (ఆంధ్రజ్యోతి): షరాఫ్ బజారులోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం 1108 లడ్డూలతో విశేష పూజ చేశారు. 11 రోజుల పాటు జరిగే ఉత్సవాలలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఈవో శ్రీనివాసరెడ్డి కోరారు. అర్చకులు శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో వైఖానస పండితులు నాగమారుతీ పూజలు చేశారు. 200ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయంలో భక్తుల సహకారంతో ఏటా ఉత్సవాలు జరుగుతున్నాయని అర్చకులు తెలిపారు. సంకీర్తన బృందం ఆధ్వర్యంలో ప్రతిరోజూ 108సార్లు హనుమాన్ చాలీసా పారాయణ జరుగుతుందని, పాల్గొనే భక్తులు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. కిరణ్‌కుమార్, సురేష్, కౌన్సిలర్ త్రిమూర్తి, బాలకృష్ణ, అనురాధ, వెంకటేష్, ఉప్పల వరదరాజులు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగించుకోవాలి

● తహసీల్దార్ సిద్ధార్థ

కొల్లిపర, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదికను ప్రజలు సద్వినియోగించుకోవాలని తహసీల్దార్ సిద్ధార్థ అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఆరు దరఖాస్తులు రావటంతో వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా సిద్ధార్థ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధికారులందరూ తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరం కోసమే ప్రతి సోమవారం ఈ వేదికను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రీవెన్స్‌లో పెట్టిన ప్రతి దరఖాస్తును పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. గ్రీవెన్స్‌కు హాజరైన వారిలో ఎంపీడీవో విజయలక్ష్మి, పంచాయతీరాజ్ ఏఈ అవుతు సాంబిరెడ్డి, ఈవోపీఆర్డీ భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.



అర్జీలను పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న పక్కన ఏసీపీ శివన్నారాయణ తదితరులు

పురపాలక సంఘానికి మూడు అర్జీలు

తెనాలి, మారీసుపేట,మే 26 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘం కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పలు సమస్యలపై మూడు అర్జీలు అందాయని మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న అన్నారు. సోమవారం స్థానిక మార్కెట్ సెంటర్‌లోని పురపాలక సంఘం కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న అధికారులతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇంజనీరింగ్ సెక్షన్‌కి ఒకటి, టౌన్ ప్లానింగ్ విభాగానికి రెండు అర్జీలు అందాయన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, ఏసీపీ శివన్నారాయణ, ఎంహెచ్‌వో డాక్టర్ హెలెన్ నిర్మల, ఆర్‌వో రాంప్రసాద్, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయానికి 11 అర్జీలు

తెనాలి రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 11 అర్జీలు అందినట్లు డిప్యూటీ తహసీల్దార్ ఎంవీఎస్ ప్రసాద్ తెలిపారు. వాటిల్లో సర్వేకి 6, హౌసింగ్ 1, పింఛన్‌కు 1, రైస్ కార్డు 1, ఆరంగల్ 2, ఇన్‌కం సర్టిఫికెట్ 1 వచ్చినట్లు వెల్లడించారు. నిర్ణీత సమయంలోపు వాటిని పరిష్కరించడం జరుగుతుందని పేర్కొన్నారు.


కాలువలోని మురుగును తొలగిస్తున్న కమిషనర్ శేషన్న తదితరులు

పారిశుధ్యాన్ని మెరుగుపర్చండి: మున్సిపల్ కమిషనర్

తెనాలి, మారీసుపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రతి వార్డులో పారిశుధ్యం పనులను మెరుగుపర్చాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న అధికారులను ఆదేశించారు. సోమవారం పద్మశాలిపేట 19వ వార్డులో జరుగుతున్న శానిటేషన్ పనులను మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ శేషన్న కాలువలోని మురుగును తొలగించి పారిశుధ్య కార్మికులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకొని పక్కా ప్రణాళికతో శానిటేషన్ పనులను చేపట్టామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.